


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 59 | ది. 3-6-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 59 | Date : 3-6-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |

## దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు: గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్

● డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు అధ్యక్షత వహించిన గవర్నర్







**విజయవాడ, జూన్ 2 (వార్తాప్రభ) :** ఆరోగ్య సంరక్షణ దేశ ప్రగతికి కేంద్ర బిందువుగా మారిందని, నాణ్యమైన, అందు బాటులో ఉండే, అందరికీ సమానంగా చేరువయ్యే వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మంగళ వారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు ఆయన అధ్యక్షత వహించి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతులు, ప్రజారోగ్య సేవల విస్తరణ ద్వారా ఈ లక్ష్య సాధనకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. వైద్య రంగానికి విశిష్ట సేవలను యూనివర్సిటీ అందించిందన్నారు.. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైద్య, ఆరోగ్య విజ్ఞాన విద్యలో విశిష్టమైన వారసత్వాన్ని నిర్మించుకుందని, వైద్యులు, దంతవైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు మరియు అనుబంధ ఆరోగ్య నిపుణులను తీర్చిదిద్దుతూ దేశ విదేశాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి దోహదపడిందని గవర్నర్ కొనియాడారు. విద్యార్థులు ప్రజాసేవ, మానవ గౌరవ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. డీఎండీసీ కేంద్రం ఏర్పాటు అభినందనీయం అని అన్నారు. విశ్వ విద్యాలయంలో సమీకృత వ్యాధి పర్యవేక్షణ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన "డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటె లిజెన్స్ సెంటర్ ను గవర్నర్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో వ్యాధుల అంచనా, విశ్లేషణ, నిర్ణయాల రూపకల్పనలో నిపుణులను తీర్చిదిద్దే ఈ కేంద్రం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు యోగా, ధ్యానం సాధన చేయాలని, ఆరోగ్యక రమైన ఆహారపు అలవాట్లు పాటించాలని, తగిన విశ్రాంతి, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని గవర్నర్ సూచించారు. శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించి, జీవితాంతం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని ఆకాంక్షిం చారు. 29వ స్నాతకోత్సవ ముఖ్య అతిథి, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల అరిథ్మియా మరియు ఎలక్ట్రోఫిజియాలజీ సేవల డైరెక్టర్ డాక్టర్ సి. నరసింహన్‌కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. 30వ స్నాతకోత్సవంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రుల కార్డియాక్ సైన్సెస్ విభాగం డైరెక్టర్, హెచ్‌వోడీ డాక్టర్ పి.సి. రాత్ కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ యూనివర్సిటీ వార్షిక నివేదికను సమర్పించి విద్య, పరిశోధన, సాంకేతికత, విద్యార్థుల సంక్షేమ రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

## సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా గోదావరి పుష్కరాలు

● ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం ● పుణ్య స్నానాలకు 10 కోట్ల మంది వస్తారని అంచనాలు ● 6 జిల్లాల్లో కొత్తగా 237 ఘాట్లు నిర్మించాలని ప్రతిపాదనలు ● త్వరలో పుష్కర లోగో విడుదల -- విస్తృతంగా ప్రచారం ● గోదావరి పుష్కరాలు-2027పై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, జూన్ 2 (వార్తాప్రభ) :** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, చారిత్రక వైభవం ఉట్టిపడేలా... మరింత ఆకర్షణీయంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి సమీప ప్రాంతాల్లో ఎన్నో పుణ్యక్షేత్రాలు కొలువై ఉన్నందున పుష్కరాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణపై మంత్రుల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించారు. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో సీఎం వెల్లడించారు. దీంతో పోలవరం ప్రాజెక్టుకు కూడా సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు రహదారిని అఖండ గోదావరిగా అభివృద్ధి చేయాలన్నారు. కేవలం పుష్కరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని పనులు పరిమితం చేయకుండా, ఇప్పుడు చేసే అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్నారు. పుష్కరాల నిర్వహణతో రాజమహేంద్రవరం మహా నగరంగా అభివృద్ధి చెందాలని సీఎం చెప్పారు.

**పుష్కరాలకు కేంద్ర సాయం కోరండి..** హైవే ట్రాఫిక్ మేనేజ్మెంట్, రైల్వే ట్రాఫిక్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రద్దీపైనా దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. భక్తుల సౌకర్యార్థం, ఎవరికీ ఎలాంటి గందరగోళం లేకుండా పుష్కర ఘాట్లకు నెంబరింగ్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. జాతీయ, రాష్ట్ర రహదారుల అనుసంధానం, విశాఖ నుంచి విజయవాడ వరకూ రైలు సర్వీసులు పెంచడం జరగాలని సీఎం నిర్దేశించారు. ప్రత్యేక రైళ్ల గురించి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాయడంతో పాటు, గోదావరి పుష్కరాలకు కేంద్ర సాయాన్ని కోరాలన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను, హోం స్టేలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోదావరి పుష్కరాలను అభివృద్ధికి అద్భుతమైన అవకాశంగా చూడాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పుష్కర పనుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

**గోదావరి గట్టు బ్యూటిఫికేషన్..** పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రహదారులు నిర్మించడంతో పాటు, గోదావరి గట్టు బ్యూటిఫికేషన్ చేయాలని సీఎం సూచించారు.

## డిఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

● బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్



**విజయవాడ, జూన్ 2 (వార్తాప్రభ) :** డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళనలో ఉందని, ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ చేయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకాలలో ఒకటిగా డీఎస్సీ నోటిఫికేషన్ దస్త్రం ఉంది. అయితే ఆ సంతకం చేసి దాదాపు పది నెలలు గడిచినప్పటికీ డీఎస్సీ ప్రక్రియ పూర్తికాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. అప్పటికే డీఎస్సీ ద్వారా 35 వేలకుపైగా వివిధ విభాగాల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నప్పటికీ, కేవలం 16,347 పోస్టులతో మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీయడమే. ఈ పోస్టుల కోసం లక్షలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు పోటీ పడ్డారు. ఒక్కో జిల్లాలో కొన్ని ఎస్జీటీ, ఎసఏ వంటి పోస్టులకు పూర్తిగా ఖాళీలు లేకపోవడం కూడా తీవ్ర అసంతృప్తికి దారితీసిందన్నారు.. డీఎస్సీ ప్రక్రియ మొత్తం వివాదాలు, న్యాయపరమైన కేసులు, పరిపాలనా లోపాల నడుమ సాగి, చివరకు హడావుడిగా నియామక ప్రక్రియ ముగించారనీ, ఇటీవల పేపర్ లీకేజీ ఆరోపణలు, డీఎస్సీ క్రీడావిభాగం కోటాలో అవకతవకల ఆరోపణలు వెలుగులోకి రావడంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ అంశాలపై వస్తున్న ఆరోపణలకూ, అధికారులు చెబుతున్న వివరణలకూ ఎలాంటి పొంతన లేకపోయింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), డీఎస్సీ పరీక్షలు రాయకుండానే క్రీడా విభాగం కోటా పేరుతో ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయనీ,. దీనివల్ల ప్రతిభావంతులైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపికైన కొందరు అభ్యర్థులను తొలగించి, వారి స్థానాల్లో క్రీడా కోటా పేరుతో మరికొందరిని ఎంపిక చేసిన విధానం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. కొందరు అక్రమాలకు పాల్పడి నకిలీ క్రీడా సర్టిఫికెట్లు సృష్టించి లబ్ధి పొందారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏ ప్రభుత్వాలు వచ్చినా నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడటం పాలక వర్గాలకు పరిపాటిగా మారిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం చివరి దశలో డీఎస్సీ-2024 ద్వారా 6,100 పోస్టులు ప్రకటించగా, న్యాయపరమైన సమస్యలు, ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, ఆ 6,100 పోస్టులతో కలిపి మొత్తం 16,347 పోస్టులతో కొత్త డీఎస్సీ ప్రకటించింది. అంటే అదనంగా కలిపిన పోస్టులు దాదాపు 10 వేల వరకే పరిమితమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వ సూపర్-6 హామీలలో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ లెక్కన ఈ రెండేళ్లలో కనీసం 8 లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగాలు కల్పించలేకపోయిన నేపథ్యంలో నిరుద్యోగ భృతి రూపంలో ప్రతి నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున, రెండేళ్లకు రూ.72 వేల చొప్పున ప్రభుత్వం బకాయి పడింది. దీనివల్ల నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళనలో ఉంది. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన హామీని కూడా కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతో పాటు ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సిన అన్ని ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డీఎస్సీ క్రీడా విభాగం పోస్టుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు.

**IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT NANDIGAMA**

O.S.No.370/2025

Between:

Korlapati Srinivasa Rao ----------Plaintiff

And

Karise Santhosh Kumar (died)
1. Karise Sharon Roja
2. Karise Akhil
3. Karise Nikhil

----------Defendants

**NOTICE**

To:

**THIRD DEFENDANT** IS Karise Nikhil S/o Late Karise Santhosh Kumar, Hindu, aged about 19 years, R/o : S.C. Colony, Budawada Post, Jaggaiahpet Mandal, NTR District.

పై నెంబరు పిటీషన్ లో Third Defendant అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకోనందున పేపర్ ద్వారా నోటీసు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. వాయిదా ది.30-6-2026 నకు అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదీన ఉదయం గం.10.30ని॥లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేని యెడల మీకు పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(By order of this Hon'ble Court)
(వాయిదా తేది : 30-6-2026)

ఇట్లు
**గోపు వెంకట శ్రవణ్ కుమార్,** బి.యల్.,
న్యాయవాది, సెల్ : 9849348063









# కాంచాకోడూరులో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



**పెడన,జూన్ 2 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం లోని కంచాకోడూరు గ్రామంలో కంచాకోడూరు గ్రామ సచివాలయం లో మంగళవారం నాడు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. టిడిపి మండల అధ్యక్షులు గోపి నాగబాబు మండల కార్యదర్శి తోట వేణు మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు బీజేపీ మండల అధ్యక్షులు కోలపల్లి రజని కుమార్ నీటి సంఘం అధ్యక్షులు కటకం వీర వెంకట నాగమల్లేశ్వరరావు టిడిపి గ్రామ అధ్యక్షులు కోళ్ల నాగరాజు రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ సాయి వీఆర్వో అంకాలరావు సర్వేయర్ సాయి పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామ రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కంచాకోడూరు గ్రామానికి మొత్తం 467 పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరుకాగా వాటి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

# పర్యావరణంపై అవగాహన




**కాకినాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. నీటిని వృధా చేయొద్దని,ప్లాస్టిక్ వాడరాదని అవగాహన కల్పించారు. నీటి రక్షణ నినాదంతో మొదలైన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కాకినాడ జిల్లా కో- కన్వీనర్,క్యాప్కో వైస్ ప్రెసిడెంట్ యుటిలిటీ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ తురగా సూర్యారావు పాల్గొని ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

# గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం





**జి.కొండూరు,జూన్ 2 (వార్తాప్రభ) :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కడింపోతవరం గ్రామంలోని ఐడిఏ నందు కె కె స్టీల్స్ కంపెనీ వెనకవైపు రైల్వే ట్రాక్ కు సమీపం లో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం మంగళవారం బయట పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చనిపోయిన వృద్ధుడి కి సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు ఉంటాయని,లోపల మాసిన తెలుపు రంగు బనియన్ తరహా వస్త్రం,పైన చెక్డ్ నీలం-తెలుపు లుంగీ / చెక్కర్డ్ వస్త్రం నడుము వద్ద ఎరుపు రంగు గుడ్డ (తువ్వాలు తరహా) ఉన్నాయి. పారగాన్ కంపెనీ కి చెందిన నల్లని రంగు రబ్బరు చెప్పులు (స్లిప్పర్లు) మృతదేహానికి కొంత దూరం లో లభించాయని పోలీసులు తెలిపారు. వృద్ధుడు నేటికి 10 నుంచి 15 రోజులు అయ్యి ఉండవచ్చు అని వెల్లడించారు. ఈ వ్యక్తి గురించి లేదా మీ ప్రాంతంలో ఎవరైనా కనుమరుగైన వారి గురించి సమాచారం ఉంటే వెంటనే జి.కొండూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.సతీష్ కుమార్ (9440796448) లేదా స్టేషన్ నెంబర్-08662802233 ను సంప్రదించాలని పోలీసులు తెలియజేశారు.



గన్నవరం మండలం బుద్దవరం గ్రామానికి చెందిన ముద్రబోయిన రవి అనారోగ్యంతో బాధపడుతుండగా, వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి, క్షేమసమాచారం అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిలో మనోధైర్యాన్ని నింపిన మాజీ ఎమ్మెల్యే డా.వల్లభనేని వంశీ
-గన్నవరం,జూన్ 2 (వార్తాప్రభ) :

# కలసి యోగా చేద్దాం.. యోగాంధ్రను నిలబెడదాం..

- ఈ నెల 7 నుంచి పండగలా యోగా ప్రత్యేక కార్యక్రమాలు
- సమష్టిగా కృషిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూన్ 2 (వార్తాప్రభ) :** ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి 14 రోజుల పాటు జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. యోగాంధ్ర-2026 కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించి.. అందరికీ ఆదర్శంగా నిలిచామని, ప్రపంచ రికార్డులు సైతం సొంతం చేసుకున్నామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యం, ఆయుష్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మునిసిపల్, విద్య, పర్యాటకం, యువజన సంక్షేమం, క్రీడలు తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా థీమాటిక్ యోగాలో భాగంగా మన జిల్లాలో పోలీస్ థీమ్‌తో యోగా కార్యక్రమం జరగనుందని తెలిపారు. టూరిజం యోగాలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం, పవిత్ర సంగమం వద్ద, హరిత బెరం పార్కులో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, మైదానాలు తదితర ప్రాంతంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మునిసిపల్, అర్బన్ ప్రాంతంలోని ప్రతి పార్కులోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కూడళ్ల వద్ద స్క్రీన్లపై యోగా ప్రోటోకాల్‌కు సంబంధించిన వీడియోలను ప్రదర్శించాలని సూచించారు. యోగా ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ.. ప్రజలు, ప్రజాప్రతినిదులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషిచేసి కార్యక్రమాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అధికారులతో కలిసి 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు. వెన్యూ మ్యాపింగ్, పర్యవేక్షణ, ప్రజా భాగస్వామ్యం, శాఖల మధ్య సమన్వయంపై జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, డా. ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డా. బుల్లయ్య, డా. ఎఎల్ గవర్నమెంట్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. పి.జగదీష్, వైద్యాధికారులు డా. సుకన్య, డా. పద్మజ, డా. లలిత, డా. వాణి, డా. విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 19 న రాజమండ్రిలో బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

- విజయవంతం చేయాలని వక్తల పిలుపు



**కాకినాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** బ్రాహ్మణుల ఐక్యత ధ్యేయంగా జూలై 19న రాజమండ్రిలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం జరుగుతుందని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యక్రమ ఆహ్వాన కమిటీ సభ్యులు భమిడిపల్లి వెంకట రమణ మూర్తి(బాబు), కాకినాడ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ వై. పద్మనాభ స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వార్పు రోడ్లో బ్రాహ్మణ సత్రం వద్ద ఆత్మీయ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బ్రాహ్మణులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బ్రాహ్మణులలో ఐక్యత కొరకు అందరూ ఏకత్రాటిపై రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని రంగాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు హాజరవ్వడం వలన అర్థవంతమైన చర్చలు జరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణుల సామాజిక ఆర్థిక,రాజకీయ, సంఖ్యా పరంగా గుర్తించి అసమానతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియపరచేందుకు ప్రాతినిధ్యం చేయడం జరుగుతుందని అన్నారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి, బ్రాహ్మణ వివాహాలపై యువతీయువకులకు అవగాహన కల్పించడం, బ్రాహ్మణులు, అర్చకులు, పురోహిత రక్షణకై ప్రత్యేక చట్టాలు, వివిధ అంశాలపై పెద్దలతో చర్చా గోష్టులు వుంటాయని తెలిపారు. జూలై 19న రాజమండ్రి ఏకేసి కాలేజి దగ్గర మన్యం గార్డెన్స్ లో జరిగే కార్యక్రమ నిర్వహణలో బ్రాహ్మణ సామాజిక వర్గ అన్ని సంఘాలు, అర్చకులు, పురోహితులు, వ్యాపారవేత్తలు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన పెద్దలు ప్రతిఒక్కరూ కలిసివచ్చి తమ తోడ్పాటు అందించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కందాళ రవి, దివి శ్రీనివాస్, బాదంపూడి బ్రదర్స్, నిముషకవి వెంకటేష్, వి.సూర్యప్రకాశరావు, తురగా సాయి సుబ్బారావు, ఆకెళ్ళ శ్రీనివాస్, రాయవరపు ప్రభాకర్, అర్చక పురోహిత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చెరుకుమిల్లిలో మీ భూమి -మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ.....



**కృత్తివెన్ను,జూన్ 2 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి గ్రామంలో మంగళవారం మీ భూమి - మీ హక్కు కార్యక్రమాన్ని కృత్తివెన్ను తాసిల్దార్ రామ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చెరుకుమిల్లి గ్రామం: గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ పూర్తవడంతో భూయాజమాన్య హక్కు పత్రాలు (పట్టాదారు పాస్ పుస్తకాలు) పంపిణీ కార్యక్రమాన్ని చెరుకుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసిరావు, మండల టిడిపి అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు హాజరై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్ నాయక్ మాట్లాడుతూ తాను ఇటీవలే మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించానని, రైతులకు భూములకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా 22-ఏ పరిధిలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, అర్హులైన రైతులకు పాసుపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసిరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆస్తులపై నాటి ముఖ్యమంత్రి చిత్రపటాలతో పాసుపుస్తకాలు జారీ చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటి స్థానంలో జాతీయ చిహ్నంతో పాసుపుస్తకాలను అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతుల హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు తులసిరావు, టిడిపి మండల అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు జిల్లా అధికార ప్రతినిధి కూనసాని చిన్నా శివాలయం చైర్మన్ చేకూరి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి యాదశిరెడ్డి కొండ కూనసాని శ్రీనివాసరావు పమిడికొండల ఆంజనేయులు మరియు కోటమి నాయకులు రైతులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పాఠశాల విద్యాశాఖలో ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలి - ఫోర్టో



పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీం అన్సారియా ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న ఫోర్టో నాయకులు డి శ్రీను, మాగంటి శ్రీనివాసరావు లు

**విజయవాడ, జూన్ 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్మెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్మెంట్) ఆర్డర్--2025 ప్రకారం పాఠశాల విద్యాశాఖలోని ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను తప్పనిసరిగా జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలని ఫోర్టో నాయకులు డి. శ్రీను, మాగంటి శ్రీనివాసరావులు లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీం అన్సారియాను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్--2025లోని పేరా 3(3) ప్రకారం ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులు ప్రత్యేక కేటగిరీగా పరిగణించబడి జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొనబడిందని వారు తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, డైట్ లెక్చరర్లు తదితర పోస్టులను మల్టీ-జోనల్ కేడర్లుగా ఏర్పాటు చేయడం ఆర్డర్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగులుగా విద్యాశాఖ పరిపాలనా నియంత్రణలో పనిచేస్తున్నారని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు గెజిటెడ్ పోస్టులుగా గుర్తించబడ్డాయని గుర్తు చేశారు. ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను మల్టీ-జోనల్ కేడర్లుగా ఏర్పాటు చేస్తే స్థానిక అభ్యర్థుల నియామక, పదోన్నతి అవకాశాలు దెబ్బతింటాయని, అందువల్ల అన్ని ఫస్ట్ లెవల్ గెజిటెడ్ పోస్టులను జోనల్ కేడర్లుగానే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# భావితరాల ఆరోగ్యానికి చిరుధాన్యాల సాగు అవసరం : వ్యవసాయ శాస్త్రవేత్తలు



**చంద్రగిరి,జూన్ 2 (వార్తాప్రభ) :** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నారావారిపల్లిలో రైతులకు చిరుధాన్యాల సాగుపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా. ఎం. రెడ్డి శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు పాల్గొని రైతులకు విలువైన సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం బీపీ, షుగర్, థైరాయిడ్, ఊబకాయం వంటి సమస్యలు సాధారణమైపోయాయని అన్నారు. మనం తీసుకునే ఆహారంలో పోషకాలతో పాటు రసాయన అవశేషాలు చేరడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. హరిత విప్లవం తరువాత అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందులు, కలుపు మందుల వినియోగం పెరగడంతో జొన్న, సజ్జ, రాగి, సామ, ఊదలు వంటి చిరుధాన్యాల సాగు గణనీయంగా తగ్గిపోయిందని వివరించారు. అసోసియేట్ డీన్ డా. ఎం. రెడ్డి శేఖర్ మాట్లాడుతూ వరి, గోధుమల వంటి కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలకే ప్రజలు పరిమితమవుతున్నారని, అన్ని రకాల పోషకాలు కలిగిన చిరుధాన్యాలను మర్చిపోయారని అన్నారు. రసాయనాల అధిక వినియోగం వల్ల భూమి తన సహజ సారాన్ని కోల్పోతోందని, నేల ఆరోగ్యాన్ని కాపాడాలంటే రైతులు తమ సాగు విస్తీర్ణంలో కొంత భాగాన్ని చిరుధాన్యాల సాగుకు కేటాయించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలంటే చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డా. వేమన, డా. వై. రెడ్డిరామ్, డా. సుబ్రమణ్యం, డా. ఎ. రాజేష్, కె వి కె శాస్త్రవేత్తలు డా. ఎస్. శ్రీనివాసులు, డా. పి. సుధాకర్, అనిల్ కుమార్, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముగం, వ్యవసాయ అధికారి సి. విజయ్ భాస్కర్, ఏఈఓలు అమీర్, భరత్ గణేష్, ప్రజ్ఞ, ఆర్ ఎస్ కే , ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# శ్రీ దక్షిణాముఖ శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్ గా మల్లాది కాశీ విశ్వనాథ్

## ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ





**విజయవాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** శ్రీ దక్షిణాముఖ శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవాలయ కమిటీ నూతన అధ్యక్షునిగా మల్లాది కాశీ విశ్వనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి చెందిన మొత్తం 11 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) ముఖ్య అతిథ్యంతో ఘనంగా నిర్వహించబడింది. నూతన కమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలియజేసి, ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ మరియు భక్తులకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆలయ భక్తులు, స్థానిక ప్రముఖులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఐఐటీ లో సీటు సాధించిన కొమ్మారెడ్డి పూర్వ విద్యార్థి....



**కృత్తివెన్ను,జూన్ 2 (వార్తాప్రభ) :** సోమవారం విడుదలైన జె. ఇ. ఇ అడ్వాన్స్ 2026 ఫలితాలలో కొమ్మారెడ్డి పాఠశాల పూర్వ విద్యార్థి చంద్రాల వెంకట సుబ్రమణ్యం 4776 ర్యాంకు సాధించి ఐఐటీ సీటు సాధించాడు. ఈ విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

# 50% సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**విస్సన్నపేట,జూన్ 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారిణి జి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు కూటమి ప్రభుత్వ సభ్యుల చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. మాకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందుపుచ్చుకునేందుకు రసాయన ఎరువుల ఉపయోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను పశువుల ఎరువులను పచ్చిరొట్ట ఎరువులను శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి తద్వారా నిస్సారమైన నేల సారవంతమైన భూమిగా తయారు చేసుకొని పంటలు పండించే లక్ష్యంగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. పండించే నేల ఆరోగ్యకరంగా ఉంటే ఆ భూమి పై పడిన ఆహార పదార్థాలు తినే వారు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

# ఎన్యుమరేషన్ వర్క్ పరిశీలించిన అధికారులు



**విస్సన్నపేట,జూన్ 2 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ వర్క్ ను మండల తాసిల్దార్ లక్ష్మీ కళ్యాణి ఎంపీడీవో చిన్న రాట్నాలు పరిశీలించారు.



ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, పినపాక గ్రామంలోని గంగాదేవి చెరువు వద్ద జలధార జల హారతి 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం కు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వారితో పాటు ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము, జి.కొండూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రామకృష్ణ నాయక్, ఇంచార్జ్ తహశీల్దార్ యం.విజయ్ కుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు,స్థానిక టీడీపీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.
- జి.కొండూరు,జూన్ 2 (వార్తాప్రభ) :

## ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం

**-మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి,జూన్ 2 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డితో కలిసి మాజీ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం తెలంగాణ ఉద్యమ అమరవీరులకు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవ పోరాట ఫలితంగా ఏర్పడిందని,రాష్ట్ర అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల అమలులో ప్రతి ఒక్కరూ భాగస్వాములేనని పేర్కొన్నారు.తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని,వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని అన్నారు.ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో శేరిలింగంపల్లి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.తెలంగాణ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్యామల మహేందర్ రెడ్డి,పీఈటీ కేశవ రెడ్డి,వీరేశం, లక్ష్మి,ఉదయ కుమారి,తరుణ,సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి

**- ఆకు లక్ష్మణ్ ముదిరాజ్**



**శేరిలింగంపల్లి,జూన్ 2 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని ఓంకార్ నగర్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆకు లక్ష్మణ్ ముదిరాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ వారి త్యాగాలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మాణిక్ రావు, సీనియర్ నాయకులు మనోహర్, గణేష్ ముదిరాజ్, విజేందర్ సింగ్, రత్న కుమార్, కుమారస్వామి, పరనంది నాగులు, రాజేష్ గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బసవ శివ, నాయకులు డేవిడ్, రాము, చోటు రామ్, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, సుగుణ, నరసమ్మ,కార్యకర్తలు ఎస్. పుల్లయ్య, ఎల్ల స్వామి, శివమణి,అఖిల్, కనకరాజు, జాను,ఈ. పుల్లయ్య, కృష్ణ మోహన్ గౌడ్, సూర్య కుమార్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారం!!

- స్వేచ్ఛా వాయువులకు నాటి అమరుల త్యాగాలే కారణం
- కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలు గమనిస్తున్నారు
- భవిష్యత్తులో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలంగాణ నేల తల్లి సంకెళ్లు తెంచుకుని, స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఆ మధుర క్షణాలను స్మరించుకుంటూ గోదావరిఖని పట్టణ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు కన్నీటి త్యాగాల జ్ఞాపకాల నడుమ అత్యంత ఘనంగా జరిగాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి తెలంగాణ అమరవీరుల స్తూపం సాక్షిగా, ఆనాటి పోరాట వీరుల బలిదానాలను తలచుకుంటూ భావోద్వేగంతో నివాళులర్పించారు. అభాగ్య తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, మువ్వన్నెల జెండాను ఎగురవేస్తూ, నాటి ఉద్యమ సెగలను, అమరుల ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తుచేసుకుని అక్కడి నగర ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ, నాడు చావునోట్లో తలపెట్టి, కఠోర దీక్షతో, అపారమైన పట్టుదలతో తెలంగాణ ప్రజల దశాబ్దాల కలని సాకారం చేసిన కేసీఆర్ కీర్తిని ఎవరూ చెరిపేయలేరని, ఇవాళ మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛ వెనుక ఎందరో అమరుల రక్తం, కేసీఆర్ శ్రమ దాగున్నాయని ఆవేదనగా తెలియజేశారు. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలను మెప్పించి రాష్ట్ర సాధన కోసం పునాది వేసిన చరిత్రను మరచి, నేడు కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ పై అవగాహన రాహిత్యంతో మాట్లాడటం దురదృష్టకరమని, సంక్షేమ పథకాల ఆశ చూపి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుకు భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ ఈ రాష్ట్రాన్ని భవిష్యత్తులో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే కాపాడుకుంటుందని ధీమా వ్యక్తం చేసిన ఈ భావోద్వేగ వేడుకల్లో జహీద్ పాషా, శ్రీనివాస రావు, బూరుగు వంశీకృష్ణ, బొబ్బిలి సతీష్, స్వామి, స్వాతి, రామస్వామి, పోషం, సాయి, శ్రీహరి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎంతో సెంటిమెంట్‌తో పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావం...!!

- కన్నీటి చరిత్ర నుంచి కలల రాష్ట్రం వరకు
- ప్రతి గుండెలో గర్వాన్ని నింపే జూన్ 2
- కోట్లాది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక
- అమరవీరుల త్యాగాలకు నివాళిగా తెలంగాణ అవతరణ దినోత్సవం
- తెలంగాణ అనేది భూభాగం కాదు...చారిత్రక భావోద్వేగం




**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం అనగానే ప్రతి తెలంగాణ గుండె గర్వంతో నిండిపోతుంది. ఎన్నో దశాబ్దాల పోరాటం, వేలాది మంది త్యాగాలు, విద్యార్థుల ఉద్యమాలు, రైతుల ఆకాంక్షలు, అమరవీరుల రక్తసాక్ష్యాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. తెలంగాణ ప్రజల జీవితాల్లో ఈ రోజు ఒక పండుగ మాత్రమే కాదు, తమ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిన చారిత్రక ఘట్టం. గ్రామీణ ప్రాంతాల్లో నుంచి విశ్వవిద్యాలయాల వరకు, రైతు పొలం నుంచి ఉద్యోగి కార్యాలయం వరకు వినిపించిన "జై తెలంగాణ" నినాదం చివరకు రాష్ట్ర రూపంలో సాకారమైంది. ఒకప్పుడు అభివృద్ధికి నోచుకోలేదనే బాధతో ఉన్న తెలంగాణ నేడు నీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాల్లో తన ప్రత్యేక




ముద్రను వేస్తోంది. అయితే ఈ విజయాల వెనుక ఉన్న ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరవలేమని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన విద్యార్థులు, యువకులు, సామాన్య ప్రజల త్యాగాలు ఈ రాష్ట్రానికి బలమైన పునాది. వారి కుటుంబాల కన్నీటి చరిత్రే నేటి తెలంగాణ విజయగాథగా మారింది. అందుకే జూన్ 2న జెండాలు ఎగురవేయడమే కాదు, ఉద్యమ వీరుల ఆశయాలను గుర్తుచేసుకోవడం కూడా ప్రతి తెలంగాణ వాసి బాధ్యతగా భావిస్తున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా పల్లెలు, పట్టణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు తెలంగాణ తల్లి చిత్రపటాలకు నివాళులర్పిస్తూ ఉద్యమ అమరవీరులను స్మరించుకుంటున్నాయి. తెలంగాణ అనేది ఒక భూభాగం కాదు... అది ఒక భావోద్వేగం. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి హృదయం, త్యాగం చేసిన ప్రతి కుటుంబం, ఆశతో ఎదురుచూసిన ప్రతి పౌరుడి కలల సాకారమే నేటి తెలంగాణ. అందుకే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రతి ఇంటి పండుగగా, ప్రతి హృదయపు గర్వకారణంగా నిలిచిపోయింది. జై తెలంగాణ... జయహో తెలంగాణ.

# త్యాగాల తెలంగాణ.. సేవలే మా ధ్యేయం!!

- 24/7 ప్రజల కోసం పోలీస్ శాఖ సిద్ధం
- ప్రజా సేవలో రాజీ లేదు
- ప్రజల భద్రతే మా బాధ్యత
- సీపీ అంబర్ కిషోర్ ఝా



పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు.. ఎన్నో త్యాగాలు, పోరాటాలు, ఆకాంక్షల ఫలితంగా సాధించిన స్వాభిమాన రాష్ట్రానికి ప్రతీక అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆయన, రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటం ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, ఆ త్యాగాలను తరతరాలకు గుర్తు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు శాంతిభద్రతలు కూడా బలోపేతమయ్యాయని అన్నారు. ఒకప్పుడు



సమస్యాత్మక ప్రాంతాలుగా ఉన్న ప్రాంతాలు నేడు ప్రశాంతతకు నిలయాలుగా మారాయని, దీనిలో పోలీసు శాఖ పాత్ర కీలకమని వివరించారు. ప్రజల భద్రతే తమ ప్రధాన ధ్యేయమని, అవినీతి, నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని, అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు సేవా పతకాలు ప్రదానం చేయగా, కార్యక్రమం తెలంగాణ త్యాగాల స్ఫూర్తిని గుర్తు చేస్తూ గౌరవప్రదంగా సాగింది.

# ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం

**- సి.పి.డా.రమేష్**

**-సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం**



**శేరిలింగంపల్లి,జూన్ 2 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి,పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సీపీ డా.ఎం.రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎన్నో త్యాగాలు,పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.2014 జూన్ 2న భారతదేశ 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి,ఆవిష్కరణలు, సంక్షేమ కార్యక్రమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ,మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ప్రజలకు భద్రత కల్పించడం ద్వారా పెట్టుబడులు,పరిశ్రమలు,ఉపాధి అవకాశాలు పెరగడానికి పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు.దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సైబరాబాద్ ఒకటిగా నిలిచిందని, ఐటీ,బ్యాంకింగ్, ఫైనాన్స్,తయారీ రంగాలు, విమానాశ్రయం,ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మెట్రో రైలు, ఫ్లైఓవర్లు తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని సీపీ తెలిపారు.వివిధ రాష్ట్రాలు,దేశాల నుంచి వచ్చే ప్రజలకు భద్రత కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని అన్నారు.హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్, తలసరి ఆదాయం వంటి కీలక సూచీల్లో తెలంగాణ సాధిస్తున్న ప్రగతి ప్రతి తెలంగాణ వాసి గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో అందరి సహకారం అవసరమన్నారు.అనంతరం విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు,సిబ్బందికి మహోన్నత సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలను సీపీ ప్రదానం చేశారు. 2026 సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా



పతకాలలో సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఎంపిక కావడం విశేషం.ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లా మహిళా మండలుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి షహీన్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం,అనాథాశ్రమానికి చెందిన 28 మంది చిన్నారులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు సీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా షహీన్ అఫ్రోజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు.సైబరాబాద్ పోలీసుల ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వైవీఎస్ సుధీంద్ర, డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ఆశయాలకు దూరంగా తెలంగాణ

**సిపిఐ జిల్లా నాయకులు నిమ్మల నరసింహ**

**జవహర్‌నగర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



**జవహర్ నగర్, జూన్ 2: (వార్తా ప్రభ)**తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లయినా అమరవీరుల ఆశయ ఫలాలు పేదలకు అందడం లేదని, పేదవాడు ఇంకా పేదవాడిగానే మిగిలిపోతున్నాడని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జవహర్‌నగర్, కాప్రా మండలాల పరిధిలో సిపిఐ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మల నరసింహ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.సిపిఐ జవహర్‌నగర్, కాప్రా మండల కార్యదర్శి డి. యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నిమ్మల నరసింహ మాట్లాడుతూ.. ఎంతోమంది అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో ప్రజల కష్టాలు ఇంకా తీరకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా అధికారం, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైపోయాయని ఆరోపించారు. రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలే చూసుకుంటున్నారని, పేదలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి, ప్రజల ఆశలను నెరవేరుస్తూ వారి కష్టాలు తీర్చేలా నిజమైన అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ (ఏఐటీయూసీ ) మండల అధ్యక్షులు ఎ. ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, నాయకులు డి. మల్లిక, మాధవి, డి. నాగేష్, ఎండి. అన్వర్, ఎన్. దేవేందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రభుత్వం!!

- 128 కుటుంబాల్లో ఆనంద వెలుగులు
- సంక్షేమ పథకాలతో కుటుంబాలకు చేయూత
- ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో రాజీ ప్రసక్తే లేదు
- రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్






పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి) గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మంగళవారం ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసానిచ్చే ఆనంద క్షణాలకు వేదికగా మారింది. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా 128 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు అందడంతో ఎన్నో కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. కూతురు పెళ్లి అంటే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆనందంతో పాటు ఆర్థిక భారం కూడా ఉంటుందనే వాస్తవాన్ని గుర్తించిన ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం అనేక కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తోంది. చెక్కులు అందుకున్న తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం, కూతుళ్ల ముఖాల్లో మెరిసిన చిరునవ్వులు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ఆడబిడ్డల వివాహం కోసం అప్పుల పాలవుతున్న కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రతి ఆడబిడ్డ గౌరవప్రదంగా కొత్త జీవితంలో అడుగుపెట్టాలని ప్రభుత్వం కోరుకుంటోందని పేర్కొన్నారు. సంక్షేమ పాలనలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని భావోద్వేగం తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొని ఆడబిడ్డల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన ఈ సంక్షేమ కార్యక్రమాన్ని అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాల సాధన కోసం నేడు జవహర్ నగర్ లో భారీ ఎత్తున మానవహారం...

**గబ్బిలాలపేట ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ (జేఏసీ ) పిలుపు**

**అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం**



**జవహర్ నగర్, జూన్ 2: (వార్తా ప్రభ)**గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారంజవహర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ 'మానవహారం' నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ (జేఏసీ ) నాయకులు ప్రకటించారు.మంగళవారం గిరిప్రసాద్ నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జేఏసీ కన్వీనర్ తోటపల్లి శంకర్ అధ్యక్షతన అఖిలపక్ష అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గబ్బిలాలపేట పరిసర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాల సాధన కోసం రేపు అంబేద్కర్ విగ్రహం వద్ద దాదాపు 200 మందితో శాంతియుతంగా మానవహారం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమానికి గబ్బిలాలపేట, గిరిప్రసాద్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, శాంతినగర్, నందమూరి నగర్ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు.ఈ అఖిలపక్ష సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్ ఆర్. నరసింహ గౌడ్, శివరాయణ, దర్శనం యాదగిరి, గడ్డం సదానందం, షేక్ షావలి, ప్రవీణ్, దుర్గేష్, సూర వెంకటయ్య, సావిత్రి, పషా మియా, కలేషా, లక్ష్మీబాయి, ప్రతాప్, శ్రీదేవి, మంజుల, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## డీకే కేబినెట్ లో నో డిప్యూటీ సీఎం ?

కర్ణాటకలో కొత్త ప్రభుత్వం ఈ నెల 3న కొలువు తీరనుంది. డీకే శివ కుమార్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే డీకే కేబినెట్ లో కనీసంగా నలుగురు ఉప ముఖ్యమంత్రులు ఉండాలని మాజీ సీఎం సిద్ధరామయ్య పట్టుబడుతున్నారు. కానీ మంత్రులుగా సిద్ధ రామయ్య వర్గం నుంచి ఎవరికి తీసుకున్నా ఒకే కానీ ఉప ముఖ్యమంత్రుల పదవులు వద్దే వద్దు అన్నది డీకే ఆలోచనగా చెబుతున్నారు. ప్రస్తుతం మాజీ సీఎం సిద్ధరామయ్య కాబోయే సీఎం డీకే శివ కుమార్ ఇద్దరూ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకత్వంలో కేబినెట్ కూర్పు మీద సీరియస్ గానే చర్చలు జరుపుతున్నారు అని తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి పదవి అన్నది రాజ్యాంగ బద్ధమైనది కాకపోయినప్పటికీ రాజకీయంగా చూస్తే ప్రాధాన్యత కలిగినది అని గుర్తు చేస్తున్నారు. పైగా ఉప ముఖ్యమంత్రి పదవులు అనగానే అవి పవర్ సెంటర్లుగా మారుతున్నాయన్న ఆందోళన డీకే వర్గంలో ఉంది. నిజానికి చూస్తే డీకే ఉప ముఖ్యమంత్రిగా గడచిన మూడేళ్ల కాలం పనిచేశారు. అయితే ఆయనకు సీఎం హామీ ఉంది కాబట్టి అలాంటి ఫార్ములా కుదిరింది. కానీ తన మంత్రివర్గంలో మాత్రం ఉప ముఖ్యమంత్రి చాన్సే లేదని డీకే స్పష్టం చేయదలచారు అని అంటున్నారు. దాని వల్ల రాజకీయంగా ఇబ్బందులు తప్ప మరేమీ లేదని కూడా ఆయన వర్గం గట్టిగాబ్బ భావిస్తోంది. పట్టుబడుతున్న సిద్ధరామయ్య : అయితే ఉప ముఖ్యమంత్రులుగా తన వర్గం వారికి కనీసం నలుగురుకికి చాన్స్ ఇవ్వాలని అధినాయకత్వం వద్ద మాజీ సీఎం సిద్ధరామయ్య పట్టుబడుతున్నారని అంటున్నారు. జీ పరమేశ్వర, జమీర్ అహ్మద్ ఖాన్, కేజే జార్జ్, ఎంపీ పాటిల్ లకు డిప్యూటీ సీఎం పోస్టులు ఇవ్వాల్సిందే అని సిద్ధ రామయ్య గట్టిగానే డిమాండ్ చేస్తున్నట్లుగా భోగట్టా. వీరంతా అహిందా వర్గానికి చెందిన వారు. అంతే కాదు అహిందా వర్గానికి చెందిన వారికి అత్యంత ప్రాధాన్యత కలిగిన మంత్రి పదవులు ఇవ్వాలని కూడా సిద్ధ రామయ్య కోరుతున్నట్లుగా చెబుతున్నారు. అయితే మొత్తం కర్ణాటక మంత్రివర్గంలో 35 మంది దాకా తీసుకోవచ్చు. ఇందులో సిద్ధరామయ్య వర్గానికి పది మందికి మాత్రమే కేబినెట్ లో చోటు కల్పించి ఆ కోటాను అంతవరకే ఉంచాలని కాంగ్రెస్ అధినాయకత్వం చూస్తోంది అని అంటున్నారు. డీకే శివకుమార్ కి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ఆయన సీఎం గా సజావుగా పనిచేసుకునేలా కేబినెట్ లో కూర్పు ఉండాలని కూడా కాంగ్రెస్ హై కమాండ్ భావిస్తోంది అని అంటున్నారు. ఇక సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపించాలని ఆయనను రాష్ట్ర రాజకీయాల నుంచి ఢిల్లీకి తీసుకుని రావాలని కాంగ్రెస్ అగ్ర నేతలు చూస్తున్నారు. దానికి సిద్ధరామయ్య అయితే ససేమిరా అని అంటున్నట్లుగా చెబుతున్నారు. తాను ఎమ్మెల్యేగానే రాష్ట్ర రాజకీయాల్లో కొనసాగుతాను అని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇక ఆయన సతీమణి పార్వతికి రాజ్యసభ ఇస్తామన్నా కూడా సిద్ధరామయ్య అంగీకరించడం లేదని అంటున్నారు. ఆమెకు రాజకీయాల పట్ల పరిచయం లేదని ఆసక్తి కూడా లేదని చెబుతున్నారని అంటున్నారు. అయితే సిద్ధరామయ్య కుమారుడు యతేంద్రకు డీకే కేబినెట్ లో చోటు కల్పించేందుకు హై కమాండ్ ఒకే చెప్పిందని కూడా ప్రచారం సాగుతోంది. మొత్తం మీద చూస్తే ఇరవై మంది మంత్రులతో డీకే బుధవారం ప్రమాణం చేస్తారు అని అంటున్నారు. మిగిలిన 15 మంది మంత్రుల ఖాళీలను విడతల వారీగా భర్తీ చేసుకుంటారని తెలుస్తోంది.

## ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం



విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదిన సందర్భంగా సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ దుర్గమ్మ గుడి ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .సుజనా మిత్ర కోఆర్డినేటర్లతో కలిసి భక్తులకు, బాటసారులకు అన్నదానం చేశారు.. ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కూటమి పార్టీల నేతలు , అభిమానులు పశ్చిమ లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు.

## ఎన్టీఆర్ జిల్లా బీజేపీ నేతల ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా.......



విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి) మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ నాయకత్వంలో జన్మదిన వేడుకలు పశ్చిమ నియోజకవర్గం అంతట ఘనంగా నిర్వహించారు.భారతీయజనతాపార్టీ ఎన్టీఆర్ జిల్లా నాయకులు ముందుగా విజయవాడ ఇంద్రకీలాద్రి కనక దుర్గ అమ్మవారి ఆలయంలో సుజనా చౌదరి ఆయు ఆరోగ్యాలతో నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సుజనా ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా,రాజ్యసభ సభ్యునిగా, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రిగా,ఉన్నత బాధ్యతలను నిర్వర్తించి ,ప్రస్తుతం విజయవాడలోనే ఒక విభిన్నమైన నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎదురులేని ఆధిక్యంతో గెలిచి, అటు ప్రభుత్వం ద్వారానూ - ఇటు సుజనా ఫౌండేషన్ ద్వారాను,ప్రజలకు నిత్యం తన సేవా కార్యక్రమాలను అందిస్తూ .. ఏపీలోనే నెంబర్ వన్ ఎమ్మెల్యేగా ప్రభుత్వ అధినేతల మరియు ప్రజల ప్రశంసలు పొందుతున్న సమర్థవంతమైన నాయకులు, గొప్ప వ్యాపారవేత్త,అసాధ్యాలను సుసాధ్యాలుగా చేస్తున్న ఏకైక ఆంధ్ర రాజకీయనేత, స్ఫూర్తి ప్రదాత,జనహృదయనేత,విద్యాదాత,, వై సుజనా చౌదరి కి హృదయపూర్వక జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ..మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, కోరుకుంటూ...పశ్చిమ నియోజకవర్గ భారతీయ జనతాపార్టీ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ లు కట్ చేసి వస్త్రాలు పంపిణీ,పండ్ల పంపిణీ,మజ్జిగ పంపిణీ,అన్నదానాలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో టపాసులు మోతలతో సుజనా చౌదరి నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయజనతా పార్టీ రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇంఛార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజి,బిజెపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి,పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్ మరియు ఎన్టీఆర్ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యమే కీలకం

● యాంటీ మలేరియా మాసం-2026 సందర్భంగా 25వ డివిజన్‌లో అవగాహన ర్యాలీ



విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి) విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు యాంటీ మలేరియా మాసం-2026 కార్యక్రమాలలో భాగంగా నగర పరిధిలో గల అన్ని డివిజన్లో మలేరియా మరియు ఇతర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే.అర్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన ర్యాలీని బయాలజిస్ట్ సత్యనారాయణ నిర్వహించారు. మంగళవారం ఉదయం 25 వ డివిజన్ మారుతి నగర్ లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి శుభ్రపరచాలని సూచించారు. అలాగే వాడని టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాలు వంటి దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉండే వస్తువులను తొలగించాలని కోరారు. దోమల కాట్ల నుంచి రక్షణ కోసం దోమతెరలు, రిపెల్లెంట్లు వినియోగించాలని వివరించారు.ఈ ఏడాది యాంటీ మలేరియా మాసం థీమ్ అయిన "మలేరియాకు ముగింపు -- ఇప్పుడు మనం చేయగలం, తప్పక చేయాలి" అనే సందేశాన్ని ప్రజలకు వివరించి, వెక్టర్ జనిత వ్యాధుల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు తెలిపారు. మలేరియా నిర్మూలన లక్ష్య సాధనకు ప్రతి కుటుంబం పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలని, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. విజయవాడ నగరాన్ని మలేరియా రహిత, దోమల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సిబ్బంది, ప్రజారోగ్య విభాగం సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని మలేరియా నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.



గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామం వాస్తవ్యులు దోమతోటి వెంకటేశ్వరరావు అకాల మరణం చెందగా ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిలో మనోధైర్యాన్ని నింపిన మాజీ ఎమ్మెల్యే డా. వల్లభనేని వంశీ - వార్తా ప్రభ,గన్నవరం

## పాలకుల గుట్టు విప్పేది ప్రజా కళలే!



విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)ప్రజల్ని మతోన్మాదంలో, మరోవైపు భ్రమల్లో ముంచుతున్న పాలకుల నిజ స్వరూపాన్ని బట్టబయలు చేయడానికి ప్రజా కళారూపాల ఆవశ్యకత నేడెంతయినా ఉందని వక్తలు ఉద్ఘాటించారు. సీపీఎం పటమటలంక నాయకుడు, ప్రజా నాట్యమండలి ప్రముఖ కళాకారుడు లకనం ప్రసాద్ సంస్మరణ సభ ఇక్కడి ఎంబీవీకేలో జరిగింది. ప్రసాద్ మృతికి వక్తలు తీవ్ర విచారం వ్యక్తంచేశారు.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. కళారంగంలో ప్రసాద్ మంచి కృషిచేశారన్నారు. కుటుంబ సభ్యుల్ని కూడా ఉద్యమాభిమానులుగా తయారుచేశారని తెలిపారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఫాసిజం విశృంఖలంగా జూలు దులుపుతున్న వేళ ప్రజానాట్యమండలి ఆవిర్భవించిందని గుర్తుచేస్తూ ప్రస్తుతం భారతదేశంలో మళ్లీ అలాంటి ప్రమాదం తీవ్రంగా పొంచి ఉన్నందున ప్రజల్ని కళారూపాల ద్వారా జాగృతం చేయాల్సిన బాధ్యత ప్రజానాట్యమండలి మీద ఉందన్నారు. మన కలాన్ని, గళాన్ని ఆపాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా తయారైన ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో ప్రజా కళారూపాల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. సమాజం కోసం ఏమైనా మంచి చేయాలి అనే ధోరణి తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని గావించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బలమైన సాంస్కృతిక ఉద్యమ నిర్మాణమే లకనం ప్రసాద్ కు అర్పించే నిజమైన నివాళి కాగలదని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.కాశీనాథ్ పేర్కొన్నారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ లకనం ప్రసాద్ చివరివరకూ కమ్యూనిస్టుగా నికరంగా నిలబడ్డారని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ మాట్లాడుతూ జన జాగృతే కళల పరమావధి అనే లక్ష్యంతో ప్రజానాట్యమండలి నిర్మాణయుతంగా కృషిచేస్తోందని తెలిపారు. జగన్, హనీఫ్, కవి, పి.ఎన్.ఎం, శ్రీనివాసరావు (కొండపల్లి) తదితరులు పాడిన విప్లవ, అభ్యుదయ గీతాలు అలరించాయి. ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో చీమలపాడు దళ బాలలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.ఎన్.ఎం. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వి.రంగారెడ్డి, పి.అప్పన్న, పి.ఎన్.ఎం. అలనాటి విజయవాడ డివిజన్ దళ బాధ్యులు ఎస్.వాణీప్రసాద్, కె.దేవేంద్ర, వడుగు లక్ష్మీనారాయణ కన్నా బాబ్జీ, దూర్వాసుల రామారావు, మన్నే శ్రీనివాసరావు- పి.ఎన్.ఎం. కృష్ణా జిల్లా నాయకులు ఎస్కే ఖాసిం, పి.కొండబాబు- ఎన్ టీ ఆర్ జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి ఆషా- ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఆర్. రాజేష్, సీనియర్ జర్నలిస్ట్ వడ్లమూడి పద్మ, ప్రసాద్ కుటుంబ సభ్యులు లకనం వెంకటేశ్వరమ్మ, రాజు, రవితేజ, సజిత, కె పద్మజ.. పెద్ద సంఖ్యలో బంధువులు, మిత్రులు, కళాకారులు పాల్గొన్నారు. పి.ఎన్.ఎం. సీనియర్ కళాకారుడు సీహెచ్ వి అప్పారావు పర్యవేక్షించారు.

## జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదిన వేడుకలు

### మహిళలకు చీరలు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసిన కూటమి నాయకులు



విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ప్రజానీకానికి అత్యంత తక్కువ సమయంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల నమ్మకం సంపాదించుకున్నారనీ జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సితార సెంటర్ వద్ద ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భారీ కేక్ ని జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెనుగొండ సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్ కట్ చేశారు. అనంతరం మహిళలకి చీరలు పంపిణీ, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా సుజనా చౌదరి ఎన్నికైన నాటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. దానికి నిదర్శనమే విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గాల్లో మొదటి నియోజకవర్గంగా పేరు పొందిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేసిన ర్యాంకింగ్స్ లో కూడా మొదటి స్థానం సంపాదించిందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సొంత నిధులతో సైతం కల్పించిన ఘనత ఎమ్మెల్యే సుజనా చౌదరికే దక్కింది అన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో చల్లటి నీరు పలు ముఖ్య కూడల్లో పంపిణీ చేయడం, సంవత్సరం పొడవునా మెడికల్ క్యాంపులు నిర్వహించడం ప్రజలు ఎంతగానో స్వాగతించారని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలతో భాగ్యస్వామ్యమై సోషల్ రెస్పాన్సిబులిటీ కింద నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వపరంగా కూడా అత్యధిక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు వేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తిరుపతి సురేష్, గన్ను శంకర్, మరుపిల్ల రాజేష్, అత్తులూరి పెదబాబు, తమ్మిన లీల కరుణాకర్, సమతం సత్తిబాబు, కార్తీక్, జనసేన పార్టీ కార్యకర్తలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు దోహదం

### మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు





విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి కుటుంబాభివృద్ధికి తోడ్పడేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు.సోమవారం సాయంత్రం రామకృష్ణాపురం లోని ఆర్ఎంపీ అసోసియేషన్ హాలు లో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 230 మంది మహిళలకు కుట్టు మిషన్‌ల నిర్వహణ, దుస్తుల తయారీ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోగల 135 మంది మహిళలలో 75 మంది కి ఆర్.ఎం.పి అసోసియేషన్ హాల్ రామకృష్ణాపురం లో గల శిక్షణ కేంద్రంలో మరియు 60 మందికి న్యూ ఆర్ఆర్ పేటలో గల శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోండా ఉమామహేశ్వరరావు మహిళలకు కుట్టు మిషన్లను అందజేసి మాట్లాడారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నైపుణ్యా భివృద్ధి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలరని తెలిపారు.శిక్షణతో పాటు అవసరమైన పరికరాలను అందించడం ద్వారా మహిళలు తమ సొంత ఉపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ చేపడుతున్న స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. శిక్షణ పొందిన మహిళలు అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సి డి ఓ జగదీశ్వరి, టెక్నికల్ ఎక్స్పర్ట్ సుజాత, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## కూటమి పశ్చిమ మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి పుట్టినరోజు వేడుకలు

### శ్రీ వెంకట సాయి వృద్ధాశ్రమంలో నెలరోజుల కు సరిపడా నిత్యావసర సరుకులు, రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేత



విజయవాడ పశ్చిమ జూన్ 2: (వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వై. సుజనా చౌదరి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కూటమి పశ్చిమ మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో సుజనా చౌదరి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లో ఉన్న శ్రీ వెంకట సాయి వృద్ధాశ్రమ సేవా సంఘం వృద్ధాశ్రమంలో అక్కడి వృద్ధులకు నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను, కూరగాయలను అందజేశారు. అలాగే వారికోసం రెండు సీలింగ్ ఫ్యాన్లను కూడా అందజేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పేరిట కేక్ ని కట్ చేసి కేక్ తో పాటు మామిడి పండ్లను కూడా వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి మాజీ కార్పొరేటర్లు, నాయకులు మాట్లాడుతూ పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ ర్యాంకు సాధించారని చెప్పారు. ఆయన సేవా దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆయన పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో సరుకులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ , కూటమి మాజీ కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, మైలవరపు కృష్ణ, బుల్లా విజయ్ కుమార్, మరుపిళ్ళ రాజేష్, మైలవరపు రత్నకుమారి దుర్గారావు, అత్తులూరి ఆదిలక్ష్మి పెదబాబు, గుడివాడ నరేంద్ర రాఘవ, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), అబ్దుల్ అఖిబ్ హర్షద్ ,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ సిబ్బందికి, భక్తులకు గొడుగులు పంపిణీ



విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదినం సందర్భంగా దుర్గమ్మ గుడి సిబ్బంది, మరియు భక్తుల రక్షణ కోసం గొడుగులు పంపిణీ చేశారు.పశ్చిమ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం సుజనా ఫౌండేషన్ మరియు ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో పశ్చిమలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గగుడి ఆవరణలో లోఎండలో విధులు నిర్వహించే సిబ్బందికి భక్తుల రక్షణ కోసం గొడుగులు పంపిణీ చేశారు. గొడుగులను ఆలయ డీ ఈ ఓ నాగ కిషోర్ కు ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అందజేశారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అడ్డూరి శ్రీరామ్, పత్తిపాటి శ్రీధర్ ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆయురారోగ్యాలతో ఉండాలనిప్రజలకు మరింత సేవ చేసే శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు.ఎండ, వానల నుండి ఆలయ సిబ్బందికి, మరియు భక్తులకు ఉపశమనం కల్పించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో 99 గొడుగులను పంపిణీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దుర్గమ్మ గుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ అవ్వారు బుల్లబ్బాయి, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం కన్వీనర్ పచ్చిపులుసు వెంకట శివప్రసాద్, పాల్గొన్నారు..

## నవ్వు ముఖం అందం

చిరునవ్వుల వదనాలు
విరబూసిన కుసుమాలు
వెదజల్లును అందాలు
పెనువేయును బంధాలు
నవ్వుతోనే లాభాలు
జీవితాన కోకొల్లలు
నవ్వు దివ్య ఔషధము
చేకూర్చును ఆరోగ్యము
నవ్వులోనే మోదము
అదే లేక ఖేదము
దరహాసము మధుమాసము
జీవితాల్లో అవసరము
అనారోగ్యాలకు సెలవు
మేలులెన్నో కలవు



నవ్వులేని ముఖాలు
అందవిహీనానికి నెలవు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# పేర్ని నానీ... మెగా డీఎస్సీపై విషప్రచారం మానుకో..!

**పేకాట ఆడేవారికి ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో నిరూపించాలని సవాల్**

**రాజకీయ ఉనికి కోసం అభ్యర్థుల్లో గందరగోళం సృష్టించవద్దు - టీడీపీ నేతలు**

**మచిలీపట్నం జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి** మెగా డీఎస్సీపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేస్తున్న విష ప్రచారంపై మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ నేతలు మండిపడ్డారు. కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే పేర్ని నాని లేనిపోని మాటలు మాట్లాడుతున్నారన్నారు. గత రెండు మూడు రోజులుగా డీఎస్సీపై పేర్ని నాని చేస్తున్న సత్యదూర ఆరోపణలను టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఉదయం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ వైస్ ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం (పంటి), టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్ తదితరులు మాట్లాడారు. యేదాది క్రితం డీఎస్సీ నిర్వహిస్తే పేర్ని నాని నేడు మీడియా ముందుకు వచ్చి అవినీతి, అక్రమాలు అంటూ అసత్య



ప్రచారం చేయడం తగదన్నారు. నోటికి హద్దు పద్దు లేకుండా పేర్ని నాని మాటలు ఉన్నాయని మండిపడ్డారు. పేకాట ఆడే వాళ్లకి డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చామని పేర్ని నాని చేసిన ఆరోపణలను రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అధికారానికి దూరం కావడంతోనే పేర్ని నాని మతిభ్రమించిన మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ టికెట్లు అమ్ముకుంటున్నారని చేసిన ఆరోపణలను కూడా నిరూపించగలరా..? అని ప్రశ్నించారు. తన అనుకూల మీడియా ద్వారా విష ప్రచారం చేయడమే పనిగా పేర్ని నాని పెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. పేర్ని నానిలాంటి వైసీపీ నేతల మాయమాటలు, కల్లబొల్లి మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి మరోసారి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించడమే లక్ష్యంగా పేర్ని నాని మాటలు ఉన్నాయన్నారు. మెరిట్ ఆధారంగానే డీఎస్సీ నియామకాలు జరిగాయన్నారు. బ్రాందీ షాపుల దగ్గర ఉపాధ్యాయులను కాపలా పెట్టిన చరిత్ర వైసీపీది అని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ను విమర్శించడానికి పేర్ని నాని సరిపోడన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, అరిసేపల్లి గ్రామ టీడీపీ ఇన్ ఛార్జ్ అమ్మిరెడ్డి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28వ తేదీన జాతీయ పల్స్ పోలియో ను విజయవంతం చేయాలి

**డాక్టర్ ఉంగా కిరణ్ కుమార్.**



**రాజాం జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి** ఈనెల 28వ తేదీన జాతీయ పల్స్ పోలియో ను విజయవంతం నిర్వహించాలని డాక్టర్ ఉంగా కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆదర్శనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఏఎన్ఎం , ఆశా వర్కర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదర్శ్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఆరు సచివాలయాల పరిధిలో 8 బూతులు,ఒక మొబైల్ టీం ద్వారా నిర్వహించబడుతుందని. 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, సంరక్షకులు భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సూచించారు. 6 సచివాలయాలు ఉండగా, మొత్తం జనాభా 24,044. ఈ పరిధిలో 0--5 సంవత్సరాల వయస్సు గల 2,011 మంది చిన్నారులు పల్స్ పోలియో టీకా పొందడానికి అర్హులున్నారని.అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది మరియు స్వచ్ఛంద కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వలస కుటుంబాలు, సంచార జాతులు మరియు ఇతర ప్రత్యేక వర్గాలకు చెందిన చిన్నారులను కూడా చేరుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టబడుతున్నాయని. పోలియో వ్యాధి శాశ్వత వైకల్యానికి దారితీసే ప్రమాదకరమైన వ్యాధి. పల్స్ పోలియో టీకా సురక్షితమైనది, సమర్థవంతమైనది. ఇప్పటికే పలుమార్లు పోలియో చుక్కలు వేసుకున్నప్పటికీ,నిర్దేశించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా చుక్కలు వేయించాలని విజప్తి చేశారు.ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయిద్దాం -- పోలియోను పూర్తిగా నిర్మూలిద్దాం అన్నారు.

## జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో... యువకుడు అదృశ్యం.

**పిఎస్ లో ఫిర్యాదు చేసిన సోదరుడు.**



**జవహర్ నగర్, జూన్ 2: (వార్తా ప్రభ)**ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని కౌకూర్ లో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... కౌకూర్ పరిధిలోని హనుమాన్ టెంపుల్ దగ్గర ఆకుల మురళీకృష్ణ (34) తన సోదరుడు ఆకుల కిరణ్ తో నివసిస్తున్నారు. ఈనెల 1వ తేదీన మురళీకృష్ణ తన కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న వేళ బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు మురళీకృష్ణ కోసం చుట్టుపక్కల వెతికిన తెలిసిన వార వద్ద వెతికిన బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు మురళీకృష్ణ సోదరుడు కిరణ్, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్వాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ




**అనుమసముద్రంపేట జూన్ 02 (వార్తాప్రభ)** ఏఎస్ పేటలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంను మంగళవారం అనుమసముద్రం పేట మండల కేంద్రంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు సంపూర్ణ అభివృద్ధికై అంగన్వాడీ కేంద్రాల్లో చదివించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తరఫున అంగన్వాడి కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వయసుకు తగిన ప్రీ స్కూలు విద్యా పోషకాహారం మరియు ఆరోగ్య పర్యవేక్షణ ఆటల ద్వారా నేర్చుకునే అవకాశాలు ఉన్నత చదువులు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ మహిళాభివృద్ధి మరియు సంక్షేమ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి సుశీల సావిత్రి ఇందిరా షకీరా తదితర ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన తల్లి,శిశువు భవిష్యత్తుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలి.

**● మాతా,శిశు మరణాలు లేకుండా కృషిచెయ్యాలి. ● హైరిస్క్ గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక పర్యవేక్షణకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి. ● ప్రాజెక్టు మాతృ అమలుపై జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి అధ్యక్షతన సమీక్ష**



**ఏలూరు, జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి:** జిల్లాలో తల్లి,శిశు మరణాలను పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న "ప్రాజెక్టు మాతృ- జీరో ఐఎంఆర్, ఎంఎంఆర్ పైలట్ ప్రాజెక్టు" అమలుపై జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు,వైద్యాధికారులుతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్షసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో పాటు శిశువులు ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తల్లి,శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికప్రమాద (హైరిస్క్) గర్భిణులను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చెయ్యడం, ప్రసవాలకు ముందు మరియు తరువాత అవసరమైన వైద్యసేవలు అందించడం, సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలుపై జిల్లా కలెక్టరు అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి ముందు ఒక నెలపాటు రోజువారీగా ఆరోగ్యపరంగా పర్యవేక్షించాలని, ప్రతి హైరిస్క్ గర్భిణీస్త్రీలను పర్యవేక్షణ కోసం ఒక అడాప్షన్ అధికారిని నియమించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు జిల్లాలో వినూత్న కార్యక్రమంగా నూజివీడు క్లస్టర్ పరిధిలో ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని అన్నారు. నూజివీడు క్లస్టర్ పరిధిలోని 11 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో మొత్తం 1,635 మంది గర్భిణులను గుర్తించగా, వారిలో 790 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించినట్లు వెల్లడించారు. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల్లో ప్రసవాలకు సిద్ధంగా ఉన్న 624 మంది గర్భిణుల్లో 315 మంది హైరిస్క్ గర్భిణులుగా గుర్తించ బడ్డారని, వీరందరికీ సురక్షిత ప్రసవాలు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో సాధించవలసిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటిపరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలుపై అధికారులతో చర్చించారు. జిల్లాలో తల్లి,శిశు ఆరోగ్య సూచికలను మెరుగు పరచడంలో ప్రతిశాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గర్భిణీస్త్రీలు ఆరోగ్యపరిరక్షణలో భాగంగా యోగాను, ఎక్సర్సైజులు తో పాటు కొద్ది సమయం నడకను తప్పక పాటించేలా చూడాలని అన్నారు. డెలివరీ అయిన తర్వాత 40 రోజులుపాటు మాతాశిశు గృహాలకు తప్పనిసరిగా వెళ్ళి వైద్య సేవలు, సూచనలు సలహాలు అందిస్తూ, పౌష్టికాహారం తీసుకోవలసిన జాగ్రత్తలుపై తెలియ చెప్పాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు. శోభ, జిల్లా ఐసిడిఎస్ పిడి పి.శారద, డిసిహెచ్ ఎస్ డా.సి.హెచ్. బేబికమల, డిప్యూటి డియంహెచ్వో డా.యస్. పద్మావతి, నోడల్ ఆఫీసరు శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గం వైద్య నిపుణులు, వైద్యాధికారులు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ రంగంలో మేస్త్రీల పాత్ర కీలకం

**చింతల్ లో తాపీ మేస్త్రిల ఆత్మగౌరవ సభ**

**తాపి మేస్త్రీలకు మద్దతు ప్రకటించిన బిజెపి జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి**

**ఆరోపణలు అవాస్తవమంటూ సెంట్రింగ్ కార్మికులకు తాపి మేస్త్రీల సంఘం హెచ్చరిక**



**చింతల్, జూన్ 2, (వార్తాప్రభ) :** తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మికుల వ్యాపార సంఘాల కూటమి (ట్రేడ్ యూనియన్) ఆధ్వర్యంలో చింతల్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద 'తాపి మేస్త్రీల ఆత్మగౌరవ సభ' ఘనంగా నిర్వహించారు. ఈ సభకు భారతీయ జనతా పార్టీ (బిజెపి) మేడ్చల్ పట్టణ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి విచ్చేసి తాపి మేస్త్రీలకు తన పూర్తి మద్దతును ప్రకటించారు.

**ఐకమత్యంతోనే హక్కుల సాధన** ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో తాపి మేస్త్రీల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. నలభై నాలుగు సంఘాల కూటమి నాయకులంతా ఎల్లప్పుడూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. అందరూ కలిసి చర్చించుకుని ఒక స్థిరమైన ధరను నిర్ణయించుకోవాలని, ఆ వివరాలను భవన యజమానులకు ముందే తెలియజేసి వారిని ఒప్పించాలని కోరారు. తద్వారా యజమానులకు, కార్మికులకు పరస్పర తృప్తి లభిస్తుందన్నారు. సెంట్రింగ్ కార్మికులతో ఉన్న సమస్యల పరిష్కారానికి సైతం ఉమ్మడిగా కూర్చొని చర్చించుకోవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

**ఆరోపణలు విడనాడాలి: సంఘం నేతల హెచ్చరిక** అనంతరం తాపి మేస్త్రీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదాము, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సంపత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల సెంట్రింగ్ కార్మికులు తమపై చేస్తున్న ఆరోపణలన్నీ ముమ్మాటికీ అవాస్తవాలని మండిపడ్డారు. ఈ విషయంలో తమకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగంలో అందరం కలిసి పనిచేసేవాళ్లమని, అలాంటి కార్మికులను విడదీసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. భవన నిర్మాణంలో తాపి మేస్త్రీలు ముందడుగు వేసిన తర్వాతే వారి వెనుక సెంట్రింగ్ వ్యవస్థ వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తాపి మేస్త్రీ ఎవరికీ అన్యాయం చేయడని, మేస్త్రీ పని ప్రారంభించిన తర్వాతే సెంట్రింగ్ పని ఉంటుందని పేర్కొన్నారు. సెంట్రింగ్ కార్మికులు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో లక్ష మంది కార్మికులతో ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా (నిరసన ప్రదర్శన) నిర్వహిస్తామని హెచ్చరించారు.

**భారీగా తరలివచ్చిన కార్మికులు:**ఈ ఆత్మగౌరవ సభలో చింతల్ ప్రాంత అధ్యక్షుడు శ్రీనివాస్ తో పాటు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న తాపి మేస్త్రీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేశారు.

## కోల రవీందర్ ముదిరాజ్‌కు ప్రతిష్ఠాత్మక 'సూర్యచంద్ర అవార్డు - 2026'

**నిరుపేదలకు సేవ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అలుపెరుగని ఉద్యమం**

**తండ్రి సమక్షంలో అవార్డు అందుకోవడం గర్వకారణం: -రవీందర్ ముదిరాజ్ భావోద్వేగం**



**కూకట్‌పల్లి, జూన్ 2, (వార్తాప్రభ) :** వివిధ రంగాలలో విశేష సేవలందించిన సామాజికవేత్తలకు ప్రతిష్ఠాత్మక సూర్యచంద్ర అవార్డు - 2026 ప్రదానోత్సవ కార్యక్రమం కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో అత్యంత ఘనంగా జరిగింది. సమాజ శ్రేయస్సు కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పలువురు ప్రముఖులకు ఈ సందర్భంగా ప్రత్యేక పురస్కారాలను అందజేసి, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో అద్భుత ప్రతిభ కనబరిచినందుకు గాను సూరారం కాలనీకి చెందిన ఆర్.ఆర్. రాజేందర్ పిళ్లై తో పాటు అదే ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఈ ఉన్నతమైన అవార్డుకు ఎంపికయ్యారు.

**రవీందర్ ముదిరాజ్ అలుపెరుగని సామాజిక ప్రస్థానం:**కోల రవీందర్ ముదిరాజ్ గత కొన్నేళ్లుగా సమాజహితం కోసం చేస్తున్న పనులను గుర్తించి సంస్థ నిర్వాహకులు ఈ పురస్కారాన్ని అందజేశారు.కరోనా కాలంలో సేవలు:లి ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, లాక్‌డౌన్ వల్ల ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు నిత్యసరుకులు, ఆహార ధాన్యాలు అందించడంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు.లిపాఠశాలల్లో అవగాహన:లి ప్రతి నిత్యం విద్యార్థులను ఉత్తేజపరుస్తూ వివిధ పాఠశాలలను సందర్శిస్తున్నారు. విద్యార్థులు ఈత నేర్చుకోవాలని, భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించాలని, ప్రతి విద్యార్థి తన ఇంటి ముందర కనీసం రెండు మొక్కలు నాటాలని ప్రచారం చేస్తున్నారు.నిజమైన పర్యావరణ ప్రేమికుడు:లి ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ఇస్తరాకులను పూర్తిగా బహిష్కరించాలని, చేతి సంచులను మాత్రమే వాడాలని ఆయన ఉద్యమిస్తున్నారు. దానికి ఆదర్శంగా తాను ఏ శుభకార్యానికి వెళ్లినా తన వెంట సొంత స్టీల్ ప్లేటును తీసుకెళ్లి భోజనం చేయడం ఆయన నిబద్ధతకు అద్దం పడుతోంది. నిత్యం ప్రజల మధ్యనే:లి రహదారులపై ఎక్కడైనా అరటి తొక్కలు కనిపిస్తే ఇతరులు జారిపడకుండా వాటిని తొలగిస్తుంటారు. చౌరస్తాలలో రద్దీ (ట్రాఫిక్) ఎక్కువగా ఉన్నప్పుడు స్వచ్ఛందంగా వాహనాలను క్రమబద్ధీకరిస్తూ, కాలినడకన వెళ్లే వారిని రోడ్డు దాటిస్తూ నిత్యం ప్రజల మధ్యనే గడుపుతున్నారు.

**బాధ్యత మరింత పెరిగింది: రవీందర్ ముదిరాజ్** అవార్డు అందుకున్న అనంతరం రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఈ పురస్కారం వల్ల తనపై సామాజిక బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇకపై మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు, ప్రకృతికి సేవ చేస్తానని సభాముఖంగా ప్రమాణం చేశారు. ముఖ్యంగా ఈ అవార్డు ప్రధానోత్సవ సభలో తన తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు (రిటైర్డ్ హెడ్మాస్టర్) ఎనభై ఆరు సంవత్సరాల వయస్సు గల ఈశ్వరయ్య పాల్గొని తన సన్మానాన్ని వీక్షించడం జీవితంలో మరువలేని సంతోషాన్ని ఇచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ ఘనమైన పురస్కారాల ప్రదానోత్సవ సభలో సంస్థ అధ్యక్షులు మోహన్ చంద్ర, కార్యదర్శి అనిల్ కుమార్, ప్రముఖ నాయకులు చల్లా రాజశేఖర్ రెడ్డి, కృష్ణమాచార్యులు, జయంత్ రెడ్డి తదితర సామాజికవేత్తలు, సంస్థ ప్రతినిధులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

## 0 నుండి - 6 సం. పిల్లల కొసం ఏ ఐ ఆధారిత స్క్రీనింగ్‌శిక్షణ.



**మచిలీపట్నం జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి** బాలల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని 0-6 సంవత్సరాల వయసు గల పిల్లలతి అభివృద్ధి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చర్యలు చేపట్టడం ద్వారా వారి అభివృద్ధి ఫలితాలను మెరుగుపరచేందుకు ఏఐ(కృత్రిమ మేధస్సు) ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం 2026 గత రెండు రోజుల నుండి జరుగుతున్నది. మచిలిపట్నం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నేటితో ముగిసింది.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉన్న సిడిపిఓ లు, సూపర్వైజర్ల, వైద్యాధకారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధి సాయి కిరణ్, కోఆర్డినేటర్ డాక్టర్ . హేమ బిందు , చిన్నారుల అభివృద్ధి మైలురాళ్లు, అభిమృద్ధి లోపాల గుర్తింపు, రిఫరల్ విధానం ఏఐ ఆధారిత స్క్రీనింగ్ సాధనాల వినియోగం పై వివరించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎం.ఎన్ రాణి జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి మాట్లాడుతూ ప్రారంభ దశలో చిన్నారులలో అభివృద్ధి సమస్యలను గుర్తించడం ఎంతో ముఖ్యమని, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో పిల్లలకు అవసరమైన సేవలు అందించవచ్చని తెలిపారు.స్క్రీనింగ్ విధానాలు, అభివృద్ధి సూచికలు గుర్తంపు, డెటా నమోదు, రిఫరల్ సేవలు మరియు తదుపరి అనుసరణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమము ద్వారా జిల్లాలోని చిన్నారులకు మెరుగైన అభివద్ధి సేవలు అందించడం తో పాటు, వారి ఆరోగ్య కరమైన ఎదుగుదలకు తొడ్పాటు అందుతుందని అధికారులు తెలి పారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**రెవెన్యూ వసూళ్లపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సమీక్ష సమావేశం**



**విజయవాడ పశ్చిమ జూన్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థలో రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి ఛార్జీలు, మురుగునీటి ఛార్జీలు, వాటర్ మీటర్ ఛార్జీల వసూళ్ల పురోగతిని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ( వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని మీటింగ్ హాల్లో సమీక్షించారు.గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి ప్రస్తుత వసూళ్ల పరిస్థితిని అధికారులు కమిషనర్‌కు వివరించారు. వసూళ్లలో మరింత పురోగతి సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కమిషనర్ సూచించారు. పెండింగ్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బకాయిల వివరాలను పరిశీలించి, వాటి వసూళ్ల కోసం సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని సూచించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన కోర్టు కేసుల పురోగతిని సమీక్షించి, పెండింగ్ వ్యవహారాల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఏ యు బి శర్మ, హెలెన్, డి యస్ యస్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్థాల వాహనం స్వాధీనం



**సంగం జూన్ 02 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న చికెన్ వ్యర్థాల వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీలలో భాగంగా అటుగా అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో చికెన్ వ్యర్థాలతో నిండిన 16 డ్రమ్ములు ఉన్నట్లు గుర్తించారు. దుర్వాసనతో పాటు ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉండటంతో పోలీసులు వెంటనే స్పందించి వాహనంలోని చికెన్ వ్యర్థాలను కొండ సమీప ప్రాంతంలో పూడ్చిపెట్టించారు. అనంతరం వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రధాన కాలువలో మహిళ మృతదేహం

**చేజర్ల మండలం దొరువుపాడు వ్యక్తి గా గుర్తింపు**



**సంగం జూన్ 02 (వార్త ప్రభ ప్రతినిధి)** సంగం పోలీస్ స్టేషన్ పరిధిలోని కంద్రిక సమీపంలో ఉన్న కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్య మైంది. కాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై భోజ్యా నాయక్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామ నిమిత్తం తరలించారు. మృతురాలు చేజర్ల మండలం దొరువుపాడుకు చెందిన ధనలక్ష్మిగా గుర్తించారు.

## ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రశాంత జీవనమే తనకు ముఖ్యం

**అర్ధరాత్రి బెల్ట్ షాపులపై ఎం.ఎల్.ఏ. స్వయంగా ఆకస్మిక దాడి**
**బెల్ట్ షాపులకు చరమగీతం పాడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**
**ఫిర్యాదు చేయగానే తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పై స్థానికుల ప్రశంసల జల్లు**



**శేరిలింగంపల్లి,జూన్ 2 (వార్తాప్రభ):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ఫ్లాట్స్ కాలనీలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అర్ధరాత్రి స్వయంగా దాడి నిర్వహించి నిర్వాహకులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.స్థానిక మహిళల ఫిర్యాదుతో వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.కాలనీలో బెల్ట్ షాపుల ద్వారా నకిలీ మద్యం విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో పాటు ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని మహిళలు పీఏసీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా,ఆయన స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం నిర్వాహకులను పట్టుకుని ఎక్సైజ్, పోలీస్ అధికారులకు అప్పగించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు.బెల్ట్ షాపుల నిర్వహణతో పేద కుటుంబాలు ఆర్థికంగా,సామాజికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కల్తీ మద్యం కారణంగా గతంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగినప్పటికీ కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమన్నారు.ఎక్సైజ్ శాఖ అధికారుల అలసత్వాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు.ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రశాంత జీవనమే తనకు ముఖ్యమని పేర్కొన్న ఆయన, అక్రమ మద్యం విక్రయాలపై నిరంతరంగా నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ డి.ఐ. రమేష్ నాయుడు, ఎస్ఐ కృష్ణయ్య, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ముువ్వన్నెల జెండాలను ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**
**అమరవీరులకు ఘన నివాళులు.. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్ర స్వప్నం సాకారం**






**కుత్బుల్లాపూర్, జూన్ 2, (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం తెలంగాణ సంబరాలు మిన్నంటాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రగతి నగర్, ఉషోదయం కాలనీ, గాజులరామారం మరియు గాంధీ నగర్ ప్రాంతాలలో ముువ్వన్నెల జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ అన్ని కార్యక్రమాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జాతీయ మరియు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

**చరిత్రలో చిరస్థాయిగా కాంగ్రెస్ పాత్ర** ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాల కాలం నాటి తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను గుర్తించి, రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఈ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. స్వరాష్ట్రంలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగాలన్నదే తమ పార్టీ ధ్యేయమన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, నిరుపేదల సంక్షేమం, అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**తరలివచ్చిన కార్యకర్తలు – ప్రజా శ్రేణులు:** ఈ ఉత్సవాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, మహిళా విభాగం నాయకురాళ్లు, శ్రేణులు, పక్షాన నిలిచే అభిమానులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జై తెలంగాణ, జై కాంగ్రెస్ అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. అందరికీ మిఠాయిలు పంచుతూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, పండుగ వాతావరణంలో జరుపుకున్నారు.



# అమరవీరుల కలల తెలంగాణ!!

● సంక్షేమంతో సాకారం అవుతున్న స్వప్నం ● ప్రతి కుటుంబానికి భద్రత, ప్రతి పౌరుడికి న్యాయం రైతు, మహిళ, విద్యార్థి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ● పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ● సామాజిక, ఆర్థిక న్యాయంతో ముందుకు తెలంగాణ ● ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు






**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలంగాణ కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రం నేడు సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు స్తంభాలపై ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో పాల్గొన్న ఆయన, తెలంగాణ ఉద్యమం కేవలం ఒక రాష్ట్ర సాధన కోసం కాదని, ప్రజల ఆత్మగౌరవం, సమాన అవకాశాలు, సంక్షేమ పాలన కోసం జరిగిన మహోన్నత పోరాటమని గుర్తు చేశారు. “అమరవీరులు కలలు కన్న తెలంగాణలో ప్రతి కుటుంబం భద్రంగా ఉండాలి... ప్రతి రైతు ఆత్మవిశ్వాసంతో సాగు చేయాలి... ప్రతి విద్యార్థికి విద్య అందాలి... ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలి...” అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అందించే కార్యక్రమం పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తోందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని చెప్పారు. రైతన్నల కష్టానికి అండగా 1.54 లక్షల మంది రైతులకు రూ.114 కోట్ల రైతు భరోసా అందించగా, రూ.767 కోట్ల వ్యయంతో 3.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల శ్రమకు గౌరవం ఇచ్చామన్నారు. పేద కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా 1.39 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతుండగా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గిందన్నారు. ఇప్పటివరకు రూ.193 కోట్ల మేర మహిళలకు ఆదా కలిగిందని వివరించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు చేయూతగా 93,659 మందికి రూ.252 కోట్ల పింఛన్లు అందించామని, సొంతింటి కలను నిజం చేసేందుకు 6,451 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రూ.126 కోట్లు విడుదల చేశామని తెలిపారు. అలాగే పేదల ఆరోగ్య రక్షణ కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద 14,983 మందికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించడం ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భారం తప్పిందన్నారు. తెలంగాణ సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులకు ఇదే నిజమైన నివాళి అని తెలిపిన ఎమ్మెల్యే, రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జెండా రెపరెపలతో మాత్రమే కాకుండా, అమరవీరుల ఆశయాలను గుర్తుచేసుకుంటూ ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని కొనసాగడం విశేషమని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఎన్టీపీసీలో స్వరాష్ట్ర సంబరాలు!!

● గర్వంగా ఎగిరిన గులాబీ జెండా ● కలబోసిన ఉద్యమ స్మృతులు ● ఎన్టీపీసీ ప్రగతికి ఉద్యోగులే బలం ● దేశ నిర్మాణంలో సంస్థ పాత్ర అమోఘం ● జనరల్ మేనేజర్ ముకుల్ రాయ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి )**ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్ట్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు కేవలం ఒక అధికారిక కార్యక్రమంలా కాకుండా, నేల గొప్పతనం, అమరవీరుల త్యాగాలను, ఎందరో కన్న కలల సాకారమైన క్షణాలను గుర్తుచేస్తూ ఎంతో సెంటిమెంట్‌గా, భావోద్వేగాల కలబోతగా జరిగాయి. జ్యోతి ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ సంబరాల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుండెల్లో తెలంగాణ భావన ఉప్పొంగగా, ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనరల్ మేనేజర్ ముకుల్ రాయ్ తెలంగాణ జెండాను ఎగురవేస్తుంటే అక్కడున్న ప్రతి ఒక్కరి కళ్లు గర్వంతో మెరిశాయి. ఆ వెంటనే వినిపించిన ‘జయ జయహే తెలంగాణ’ జనపదం.. ఎన్నో ఏళ్ల పోరాట స్మృతులను, సాధించుకున్న స్వరాష్ట్ర స్వప్నాన్ని కళ్లముందు కదలాడేలా చేసి ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది. చేరవచ్చిన అతిథులకు బొకేలతో స్వాగతం పలుకుతూ, కేక్ కట్ చేసి ఒకే కుటుంబంలా ఆనందాన్ని పంచుకుంటున్న ఆ క్షణాల్లో.. నాడు ఉద్యమ కాలంలో పడ్డ కష్టాలు, నేడు సాధిస్తున్న ప్రగతి ప్రయాణం అందరిలోనూ ఒక తెలియని సంతృప్తిని నింపాయి. కార్మిక సంఘాలైన ఎన్టీపీసీ కార్మిక్ సంఘ్, మజ్దూర్ యూనియన్, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్‌బీసీ ప్రతినిధులు ప్రసంగిస్తూ.. ఈ మట్టి కోసం, ఈ నీళ్ల కోసం జరిగిన పోరాట ప్రాముఖ్యతను గుర్తుచేస్తుంటే సభలో ఒకవిధమైన నిశ్శబ్దం, ఆపై ఎనలేని గౌరవం వ్యక్తమయ్యాయి. ముఖ్యఅతిథి ముకుల్ రాయ్ మాట్లాడుతూ.. ఈ ప్రగతి ప్రయాణంలో అహోరాత్రులు శ్రమిస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగులే ఈ సంస్థకు, రాష్ట్రానికి నిజమైన బలమని, దేశ నిర్మాణంలో వారి పాత్ర వెలకట్టలేనిదని భావోద్వేగంగా కొనియాడారు. అనంతరం, కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా.. స్వేచ్ఛా వాయువులను పీలుస్తూ రంగురంగుల బెలూన్లను ఆకాశంలోకి వదిలినప్పుడు, అవి పైపైకి దూసుకెళ్తుంటే మన రాష్ట్రం కూడా ఇలాగే ఉన్నత శిఖరాలకు చేరాలని ప్రతి హృదయం ఆరాటపడింది. చివరగా వందన సమర్పణ, ఆపై జాతీయ గీతాలాపనతో ముగిసిన ఈ వేడుక, కేవలం ఒక రోజు పండుగలా కాకుండా.. తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని, సమిష్టి ఎదుగుదలను చాటుతూ ఎన్టీపీసీ కుటుంబ సభ్యుల మనసుల్లో ఎప్పటికీ చెరిగిపోని ఒక మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది.

# మిన్నంటిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

● జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ కౌన్సిలర్ కిషన్ రావు
● బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసిన బచ్చ జ్ఞానేశ్వర్.. ఘనంగా కేక్ కటింగ్




**జీడిమెట్ల, జూన్ 2, (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 132 జీడిమెట్ల విభాగం పరిధిలోని వెన్నెలగడ్డ ప్రాంతంలో తెలంగాణ సంబరాలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. స్థానిక నాయకుడు బచ్చ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**ముువ్వన్నెల జెండా మరియు పార్టీ జెండా ఆవిష్కరణ** తొలుత పూర్వపు నగర సేవకులు (మాజీ కౌన్సిలర్) కిషన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి భారతావని కీర్తిని చాటుతూ ముువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బచ్చ జ్ఞానేశ్వర్ గులాబీ జెండాను ఆవిష్కరించి జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ, వారందరికీ ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్వరాష్ట్ర సిద్ధాంతాన్ని చాటుతూ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు అందరూ కలిసి ఉమ్మడిగా కేక్ కట్ చేసి ఒకరికొకరు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ జెండా ఆవిష్కరణ వేడుకల్లో నియోజకవర్గ మరియు స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రముఖులు కుంట సిద్ధిరాములు, గంధం సుధాకర్ గౌడ్, పోగు సమ్మన్న, నేత చంద్రశేఖర్ రెడ్డి, మధు, కృష్ణ, నర్లకంటి కుమార్, రమణరావు, సతీష్ కుమార్, వీరచెట్టి తదితర నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అందరికీ మిఠాయిలు పంపిణీ చేయడంతో వెన్నెలగడ్డ పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



**కూకట్ పల్లి, జూన్ 2(వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే పిఏసి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం వారి కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి తదనతరం నాయకులతోపాటు జాతీయ గీతాన్ని ఆలపించి అమరవీరుల త్యాగాలను గుర్తుచేసికోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ కోటి ఆశలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నివిధాల అభివృద్ధి పదంలో ముందువరుసలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత, ఇబ్రహీం మరేళ్ల శ్రీనివాస్,బోయ కిషన్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జవహర్‌నగర్, జూన్ 2:(వార్తా ప్రభ)** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కీసర సర్కిల్ జవహర్ నగర్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కొటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్లు కుతాడి సాయి, చిత్ర సుబ్రహ్మణ్యం, వేణు, బల్లి రోజా శ్రీనివాస్, కల్లేపల్లి సదానందం, బూడిద వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు అనంతలక్ష్మి, బొబ్బిలి మంజుల, పార్టీ నాయకులు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో తెలంగాణ!!

**ఆధ్యాత్మిక వైభవంలో కాళేశ్వరం**
**భక్తి-భావాలకు, అభివృద్ధి- సంక్షేమంకు కేరాఫ్ అడ్రస్ దుద్దిళ్ళ**
**పుష్కరాల శోభకు మంత్రి శ్రీధర్ బాబు కృషి అభినందనీయం**
**పెద్దపల్లి పార్లమెంటరీ కాంగ్రెస్ నాయకుడు ఆసంపల్లి శ్రీనివాస్**





**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)** కాళేశ్వరం... గోదావరి ఒడ్డున భక్తి, భావోద్వేగం, సంస్కృతి కలిసే పవిత్ర క్షేత్రం. సోమవారం ముగిసిన సరస్వతీ నది అంత్య పుష్కరాలు తెలంగాణ ఆధ్యాత్మిక చరిత్రలో మరో స్వర్ణాధ్యాయంగా నిలిచాయని పెద్దపల్లి పార్లమెంటరీ కాంగ్రెస్ నాయకుడు ఆసంపల్లి శ్రీనివాస్ (వాసు) హర్షం వ్యక్తం చేశారు. త్రివేణి సంగమం వద్ద నిర్వహించిన ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి అభినందనలు తెలియజేశారు. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు, పరిశ్రమలు మాత్రమే కాదని... ప్రజల విశ్వాసాలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆధ్యాత్మిక క్షేత్రాలను సైతం అభివృద్ధి చేయడం నిజమైన పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరం క్షేత్రానికి వేలాది మంది భక్తులు చేరుకునేలా ఆధునిక సౌకర్యాలు కల్పించడం, తొలిసారిగా టెంట్ సిటీ ఏర్పాటు చేయడం, పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టడం మంత్రి శ్రీధర్ బాబు దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. “తెలంగాణను ప్రపంచానికి సాంకేతిక రంగంలో పరిచయం చేసిన నాయకత్వం, ఇప్పుడు ఆధ్యాత్మిక పర్యాటక రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తోంది” అని వాసు ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చేలా ఇప్పటి నుంచే చేపడుతున్న ఏర్పాట్లు భవిష్యత్తుపై ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయన్నారు. సరస్వతీ అంత్య పుష్కరాలు కేవలం ఒక ధార్మిక కార్యక్రమం మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి విశ్వాసాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోత్సవమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్ర సంతోష్, వరాల నర్సింగం, మిర్యాల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ దేశానికి ఆదర్శంగా ఉంది - ఎమ్మెల్యే గాంధీ




**శేరిలింగంపల్లి,జూన్ 2 (వార్తాప్రభ):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పాల్గొని ఎమ్మెల్యే గాంధీతో పాటు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు,యువ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘట్కేసర్ సర్కిల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ.

**డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి.**
**నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడలు ముప్పు శ్రీనివాసరెడ్డి.**




**కీసర, నాగారం, జూన్ 2:(వార్తా ప్రభ)** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఎంసీ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయం వద్ద డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది చేసిన త్యాగాలను నాయకులు గుర్తు చేసుకున్నారు. అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస రెడ్డి, యువ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి, వంగేటి పర్వత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాల కుమార్, మాజీ యూత్ అధ్యక్షులు ఓం ప్రకాష్ గౌడ్, కార్పొరేషన్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వేసవి శిబిరాల్లో విద్యార్థుల సందడి



**గుడివాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** వేసవి సెలవులు వృథా చేయకుండా కొత్త విషయాలను పిల్లలకు పరిచయం చేసేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు దోహదపడు తున్నాయి. ఈ క్రమంలో శాఖా గ్రంథాలయం, రాజేంద్రనగర్ గుడివాడ నందు సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థిని విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించడం అయినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి.శాంతి, పాఠకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



**గుడివాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** స్థానిక ఎన్టీఆర్ కాలనీ పరిధిలోని యుపిహెచ్‌సి ర్యాలీ మరియు సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ మలేరియా వ్యాధిన బారిన ప్రజలు పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలి, దోమలు పెరగాకుండ జాగ్రత్తలు తీసుకోవాలి, జ్వరమా మలేరియ కావచ్చు వెంటనే ఆరోగ్య కేంద్రం లో పరిక్ష చెయావలెను. అలాగే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ సమత, ఎంపిహెచ్ఏ కేశవ రావు స్టాఫ్ ఏఎంఎస్, ఆషాలు తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ



**గుడివాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ రోజున స్థానిక ఏలూరు రోడ్ల గల డి.వి.స్.కాంప్లెక్స్ నందు ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ మరియు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా ఆర్. సి. పొన్నూరు రామకృష్ణ ఎలెక్ట్ గవర్నర్ ఎం సి హెచ్ నారాయణ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమము సీనియర్ మాజీ ఏ.వి.పి.బొగ్గవరపు తిరుపతయ్య వితరణతో జరిగినది. ఈ కార్యక్రమమునకు పూర్వ అధ్యక్షులు డి.వి. సత్యనారాయణ అధ్యక్షులు గంటా చంద్రశేఖర్ ఎం. వీరశేఖర్ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి తాతా భాస్కర్ మొదలగువారు పాల్గొని దిగ్విజయం చేసినారు.

## బిజేపీ గుడివాడ రెండవ పట్టణ అధ్యక్షుడుగా ఆర్.కె.



**గుడివాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ కృష్ణాజిల్లా గుడివాడ రెండవ పట్టణ అధ్యక్షుడుగా మాచెర్ల రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు కృష్ణాజిల్లా మచిలీపట్నం బిజేపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక చేతుల మీదుగా గుడివాడ రెండవ పట్టణ భాజపా అధ్యక్షుడిగా మాచర్ల రామకృష్ణ (ఆర్.కె.) నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆర్.కె. కు పలువురు నేతలు అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా భావిస్తూ ప్రజలకు ఏదో విధంగా సహాయం చేస్తూ నన్ను అభిమానించి భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షునిగా ఎన్నుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. అదేవిధంగా ప్రజలకి ప్రభుత్వ ఉద్యోగులకు వారిదిగా ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు. ఈ అవకాశం కల్పించిన బిజెపి సీనియర్ నాయకులు గుత్తికొండ శ్రీరాజబాబు, మట్టా ప్రసాద్ లకు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

## వినూత్న వరవడికి శ్రీకారం చుట్టిన వైసీపీ



**విస్సన్నపేట,జూన్ 2 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆలీ రెహమాన్ జన్మదిన ఉత్సవ మహోత్సవ కార్యక్రమంలలో భాగంగా కేకు కట్ చేసి ఆశీస్సులు అందించి వైసీపీ పెద్దలు ఘనశీగా సత్కరించారు. రానున్న కాలంలో పుట్టినరోజులు వివాహ దినోత్సవాలు వంటి శుభకార్యాలకు అనుబంధశీ ఆత్మీయత విశ్వాసనీయతకు దర్పణం పడుతూ కార్యక్రమాలు నిర్వహిస్తామని వైసిపి లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ సిరసాని ప్రకాష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పలువురు పాల్గొని తమ ఆశీస్సులు అందించారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మెప్మా ఆర్‌పీలకు శిక్షణా కార్యక్రమం



**గుడివాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** గుడివాడ మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మెప్మా రిసోర్స్ పర్సన్స్ కోసం "సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్" అంశంపై ఒక రోజు సామర్థ్య పెంపొందింపు మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీమతి బోలెం నాగమణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత పరిరక్షణలో మరియు ఘన వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణలో మెప్మా ఆర్‌పీల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వర్గీకరణపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణానికి ఆర్‌పీలు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. శిక్షణ ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన ఆధునిక పద్ధతులు, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన విధానాలు, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే అంశాలపై ఆర్‌పీలకు సమగ్ర అవగాహన కల్పించబడిందని కమిషనర్ తెలిపారు. శిక్షణలో పొందిన విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మున్సిపాలిటీ పరిశుభ్రత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ పార్ట్నర్‌గా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నియమించిన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్ (AIILSG) వ్యవహరించగా, రిసోర్స్ పర్సన్స్‌గా కరుణాకర్, సగ్గం వెంకటేశ్వరరావు ఘన వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ పద్ధతులు, వ్యర్థాల వర్గీకరణ, రీసైక్లింగ్ మరియు శాస్త్రీయ నిర్వహణ అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సి.ఎం.ఎం కె.ఈ.వి. బసవేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది మరియు గుడివాడ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆర్‌పీలు పాల్గొన్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

**గుడివాడ,జూన్ 2 (వార్తాప్రభ) :** పురపాలక సంఘ కార్యాలయం పరిధిలోని 11, 13, 14, 15 వార్డుల్లో ప్రత్యేక తనిఖీ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (PGRS) ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పురపాలక సంఘ కమిషనర్ ఎస్. మనోహర్ ఆధ్వర్యంలో 11, 13, 14, 15 వార్డుల పరిధిలో పారిశుధ్య, కాలువల శుభ్రత మరియు ప్రజా సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా సోమవారం నిర్వహించిన "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమం మరియు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత ప్రాంతాలను పరిశీలించారు. ప్రజా సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడి, సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఎస్. మనోహర్ ఆదేశించారు. అదేవిధంగా ఆయా వార్డులలో పారిశుధ్య పరిస్థితులు, డ్రైన్ల శుభ్రత, చెత్త తొలగింపు పనులు, రోడ్ల పరిశుభ్రత మరియు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మెయిన్ డ్రెయిన్ల శుభ్రపరిచే



పనులను వేగవంతం చేయాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ చంద్ర, ఏఈ శివాజీ, ఎస్ఐ అప్పారావు, సచివాలయ సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆక్వా రైతుల కీలక సమావేశం

### ఏ.పి ఆక్వా రైతు సంఘం అధ్యక్షునిగా గాంధీరాజు ఏకగ్రీవ ఎన్నిక





**అమలాపురం,జూన్ 2 (వార్తాప్రభ) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతు సంఘాల ప్రతినిధుల సమక్షంలో కీలక రాష్ట్ర స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆక్వా సంఘ అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు అధ్యక్షతన మంగళవారం అల్లూరి రమేష్ రాజు ఆక్వా ఫీడ్స్ కార్యాలయంలోజరిగిన సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆక్వా రైతు నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఒక సమగ్ర రైతు వేదిక అవసరాన్ని గుర్తించి "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం నూతన సంఘాన్ని ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు చర్చలు జరిపిన నేపథ్యంలో ఇప్పటికే ఐదు సమావేశాలు నిర్వహించగా, అమలాపురం లో జరిగిన ఆరో సమావేశంలో రాష్ట్ర స్థాయి కమిటీని అధికారికంగా ఏర్పాటు చేసినట్లు నాయకులు వెల్లడించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన టి.నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా ప్రకాశం జిల్లాకు చెందిన యశ్వంత్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఏలూరు జిల్లాకు చెందిన హరిహర రాజు, ఖజానాదారుగా కృష్ణా జిల్లాకు చెందిన మధులను ఎన్నుకున్నారు. ఇక గతంలో ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన భాస్కర్ రాజును సంఘ గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించారు. నియోజకవర్గాల వారీగా ఈసీ సభ్యుల ఎంపిక రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా పలు ప్రాంతాల నుంచి ఈసీ సభ్యులను కూడా ఎంపిక చేశారు. ఉండి నుంచి యువరాజు, గణపవరం నుంచి వినాయక్, ఏలూరు నుంచి నాని, నరసాపురం నుంచి తర్జా బుజ్జి, ఆచంట నుంచి శ్రీనివాసరాజు, పాలకొల్లు నుంచి జాన్ రాజు, కాకినాడ నుంచి సూర్యారావు, మురమళ్ల నుంచి పృథ్వీరాజ్, అనకాపల్లి నుంచి రమేష్ రాజు, అమలాపురం నుంచి యాళ్ళవెంకటానందం, మలికిపురం నుంచి రామలింగరాజు, ప్రకాశం నుంచి సతీష్‌లను ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇంకా రాష్ట్రంలోని ఇతర ఆక్వా ప్రాంతాల నుంచి కూడా సభ్యులను కమిటీలోకి తీసుకుంటామని నాయకులు తెలిపారు. అలాగే రైతు సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ నియామక డైరెక్టర్లు, ఆక్వా రంగానికి చెందిన కీలక వ్యక్తులను కూడా సంఘంలో భాగస్వామ్యం చేయనున్నట్లు వెల్లడించారు.సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీడ్ ధరలు భారీగా పెరగడం, రొయ్యల ధరలు తగ్గిపోవడం, నాణ్యమైన సీడ్ కొరత, ప్రభుత్వం హామీ ఇచ్చిన రూపాయి సబ్సిడీ ఇంకా అమలుకాకపోవడం వంటి అనేక సమస్యలు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని అన్ని ఆక్వా రైతు సంఘాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని భావించి ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ పోరాటం ఎవరిపైనా కాదని, నష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూపాయి విద్యుత్ సబ్సిడీని తక్షణమే అమలు చేయాలని సంఘం డిమాండ్ చేసింది. అలాగే ఫీడ్ కంపెనీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఎగుమతి సంస్థలు రైతు సంఘంతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనాలని కోరింది. ఫిషరీస్ కమిషనర్, అప్పడా వైస్ చైర్మన్ ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తదితర అధికారులను కలిసి రైతు సమస్యలను వివరించి పరిష్కారం కోరనున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న ఆక్వా రైతు సంఘాలు, మండల స్థాయి సంఘాలు, రైతు నాయకులు అందరూ ఐక్యంగా ముందుకు వస్తే రైతుల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతులందరూ సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కోనసీమలో రాష్ట్ర స్థాయి సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా రైతు నాయకులకు రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం ముగింపు సందర్భంగా రైతు నాయకులు "రైతుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేస్తూ ఆక్వా రైతుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సెక్రటరీ త్సవటపల్లి మణికుమార్, రంగయ్య నాయుడు, సత్తినిడి నాని బోనం చినబాబు అల్లూరి రమేష్ రాజు , జాన్ రాజు తోపాటు అధిక సంఖ్యలో రైతసంగాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గోదావరి మహా పుష్కరాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలి



**అమలాపురం,జూన్ 2 (వార్తాప్రభ) :** గోదావరి మహా పుష్కరాలు విజయవంతానికి రెవె న్యూ, పోలీసు, జల వనరులు పంచా యితీరాజ్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులు ఒక బృందంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు శాఖాధిపతులతో రాష్ట్ర సచివాలయం నుండి జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పుష్కరాలు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లకు జాయింట్ కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరు స్థానిక అధికారుల ఉద్దేశించి మాట్లాడుతూ గోదావరి మహా పుష్కరాలు 2027 ను ప్రతి ష్టాత్మకంగా నిర్వ హించాలని సూచించారు. భక్తులకు నూతన అనుభూతిని పంచేలా కోనసీమలో పక్కా ప్రణాళికలతో ఏర్పాట్లు చేయాలన్నారు.?రాబోయే 2027 గోదావరి మహా పుష్కరాలను అత్యంత వైభవంగా,భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో పుష్కర ఏర్పాట్ల ప్రాథమిక ప్రణాళికలపై ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ వివరించారు.?ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో ఘాట్ల నిర్మాణం చేపట్టాల న్నారు.ముఖ్యమంత్రి వారి ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలో పుష్కరాల ఏర్పాట్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న గోదావరి తీర ప్రాంతాల్లో భక్తుల రద్దీని అంచనా వేస్తూ పాత ఘాట్ల ఆధునీకరణతో పాటు ముఖ్యంగా అవసరమైన చోట సరికొత్త పుష్కర ఘాట్లను నిర్మించ బోతున్నామన్నారు. నదీ తీర ప్రాంతాల్లో భద్రతా చర్యలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు?.మౌలిక వసతు ల కల్పన ?రవాణా సౌకర్యాలు కల్పనతో పాటుగా పుష్కర ఘాట్ల కు వచ్చే రహదారుల విస్తరణ, మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.భక్తుల వాహనాల కోసం విశాలమైన పార్కిం గ్ స్థలాలను ఏర్పాటు చేయాల న్నారు.పుష్కరాల సమయంలో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలక మన్నారు ఘాట్ల వద్ద నిరంతర తాగునీటి సరఫరా,తాత్కాలిక శౌచాలయాల నిర్మాణం, ఘాట్లను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించడం జరుగుతుంద న్నారు.ప్రతి ప్రధాన ఘాట్ వద్ద వైద్య శిబిరాలు, 24 గంటలూ అందుబాటులో ఉండేలా అంబులెన్స్ సేవలను సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు.?కోనసీమ సంస్కృతి ఉట్టిపడేలా కోనసీమ అంటేనే ఆతిథ్యానికి, సంస్కృతికి మారు పేరని ఇక్కడికి వచ్చే కోట్లాది మంది భక్తులకు ఆధ్యాత్మికతతో పాటుగా హోమ్ స్టే వంటి ఆహ్లా దకరమైన అనుభూతిని పంచేలా ఏర్పాట్లు చేపట్టా లన్నారు. లైటింగ్, ఘాట్ల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు?. సమన్వయంతో ముందుకు సాగుతూ ?పుష్కరాల విజ యవంతానికి అందరూ సమి ష్టిగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వారి దార్శని కథకు అనుగుణంగా,గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని,భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జీరో ఎర్రర్ తో 2027 మహా పుష్కరాలను అద్భుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు.?ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టరు వైఖోం నైదియాదేవి వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత ఉపాధి శిక్షణ

**విజయవాడ(పి.ఐ.బి.),జూన్ 2 (వార్తాప్రభ) :** విశాఖపట్నం కంచరపాలెం బాలికల ఐటిఐ ప్రాంగణంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో జూలై ఒకటో తేదీ నుండి ప్రారంభంకానున్న 2026-27 ఉచిత కోర్సులకు ఎస్సీ, ఎస్టీ చెందిన అభ్యర్థుల నుండి మరియు శిక్షణ సంస్థల (స్పెషల్ కోచింగ్ స్కీమ్ మాత్రమే) నుండి ధరఖాస్తులను స్వీకరించబడును. కేంద్ర ప్రభుత్వ ఉపాధి, లేబర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో స్పెషల్ కోచింగ్ స్కీమ్ (కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు), ఓ లెవెల్ కంప్యూటర్ సాఫ్ట్ వేయర్, ఓ లెవెల్ కంప్యూటర్ హార్డ్ వేయర్ కోర్స్ లలో ఈ శిక్షణను ఏడాది పాటు ఉచితంగా అందించబడును. శిక్షణ కాలంలో, ఎంపికైన వారికి నెలకి రూ. వెయ్యి స్టైఫండ్ అందించబడును. మరో కోర్సు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (AI) ఫౌండేషన్ టెక్నాలజీ (2 నెలలు) కూడా శిక్షణ ఇవ్వబడును. ఆశక్తి, అర్హత గల వారు దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా https://dbtscst.ncs.gov.in/users/signup 5 NCSC రుజువు పత్రాలతో అప్లై చేయవలను. అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్ / 10o2 చదివియుండవలను. కుటుంబ ఆదాయం మూడు లక్షలు మించరాదు. వయసు జూలై ఒకటో తేదీకి 18 నుండి 27 (స్పెషల్ కోచింగ్ స్కీమ్), 18 నుండి 30 (ఓ లెవెల్,-ూ×) ఉండవలను. జూన్ 10న ధరఖాస్తు ఆఖరు తేదీ. పూర్తి వివరముల కొరకు వెంటనే 0891-2788700, https://dge.gov.in లేదా ncsc.vizag/facebook . https://ncs.gov.in లేదా సందర్శించవలననీ నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఉప ప్రాంతీయ ఉపాధి అధికారి శ్యామ్ సుందర్ నీట్టల ఒక ప్రకటనలో తెలిపారు

## చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్



**మైలవరం,జూన్ 2 (వార్తాప్రభ) :** చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు ముద్దాయిలను మంగళవారం అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.సుధాకర్ ప్రకటనలో తెలిపారు. ఎస్ ఐ తెలిపిన వివరాలు ప్రకారం మైలవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కీర్తిరాయునిగూడెం అడ్డరోడ్డు వద్ద 12 మే 2026 తేదీన రాసాల నాగేశ్వరరావు తన బడ్డీ కొట్టులో కూర్చొని ఉండగా రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు హీరో గ్లామర్ మోటార్ సైకిల్ పై వచ్చి, మాటల్లో పెట్టి తన మెడలో ఆంజనేయస్వామి లాకెట్ తో ఉన్న సుమారు 28 గ్రాముల బంగారు చైన్ ను బలవంతంగా లాక్కొని వెళ్లారు.రాసాల నాగేశ్వర రావు పిర్యాదు మేరకు గుర్తుతెలియని ఇద్దరు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైలవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ -2 పి.గిరి సాయి మరియు పోలీస్ కానిస్టేబుల్ 4278, పోలీస్ కానిస్టేబుల్ 4364 ఇతరసిబ్బంది తో కలిసి దర్యాప్తులో భాగంగా చైన్ స్నాచింగ్ కు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కీర్తిరాయునిగుడెం గ్రామ శివారులో మంగళవారం అనగా 02 మే 2026 వ తేదీన అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్ఐ సుధాకర్ వెల్లడించారు.ఇద్దరు ముద్దాయి లలో ఏలూరు జిల్లా,చింతలపూడి మండలం, నామవరం గ్రామానికి చెందిన మూడు గణేష్ (29) ఎ 1 ముద్దాయిగాను,ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం,నామవరం గ్రామానికి చెందిన మూడు రమేష్ (27) ఎ 2 ముద్దాయి గా కేసులో నమోదుచేసినట్లు ఎస్ఐ తెలియజేశారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టు లో ముందు హాజరుపరచడం జరుగుతుందని తెలిపారు. ఎ 1, ఎ 2 ముద్దాయిలు మూడు గణేష్,మూడు రమేష్ లపైన గతంలో చేసిన పలు రకాల నేరాలపై కేసులు ఉన్నాయని ఎస్ఐ సుధాకర్ తెలియజేశారు.

## మన అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం



**హనుమాన్ జంక్షన్, జూన్ 2 (వార్తాప్రభ) :** గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మన అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం జూన్ 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురం గ్రామంలో అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించడం గురించి, కొత్తగా చేరే పిల్లలకు అంగన్వాడి కేంద్రాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం గురించి, అంగన్వాడీల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్య గురించి, తల్లిదండ్రులకు అవగాహన కలిగించడం జరిగింది. పిల్లల సమగ్ర వికాసానికి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ సేవలను ఇంటింటికి చేరవేస్తుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్ ఎం ఝాన్సీ రాణి, అంగన్వాడీ కార్యకర్త సునీత తదితరులు పాల్గొన్నారు.

## జల సంరక్షణకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

### -అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 2 (వార్తాప్రభ) :** జల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం ఘంటసాల మండలం తాడేపల్లిలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. గ్రామములో చెరువు పూడిక తీసిన ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడారు. గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు సిబ్బంది ఆయనకు వివరించారు. ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా పనులు చేయించి జల సంరక్షణ లక్ష్యాన్ని సాకారం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని పలువురిని పరామర్శించారు.

# విస్తృత ప్రజాభాగస్వామ్యంతోనే జనగణన ప్రక్రియ విజయవంతమవుతుంది

- సమాజ పురోగతికి జనగణనలో కచ్చితత్వం కీలకం
- మునగపాడులో క్షేత్రస్థాయిలో సెన్సస్-2027 కార్యకలాపాలను తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ





**జి.కొండూరు,జూన్ 2 (వార్తాప్రభ) :** విస్తృత ప్రజాభాగస్వామ్యంతోనే జనగణన ప్రక్రియ విజయవంతమవుతుందనీ, సమాజ పురోగతికి జనగణనలో కచ్చితత్వం కీలకం అని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం జి.కొండూరు మండలం, మునగపాడు గ్రామంలో కలెక్టర్ లక్ష్మీశ పర్యటించి జనగణన--2027కు సంబంధించి ఇళ్ల జాబితా, ఇళ్ల గణన (హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్) దశ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కోసం జనగణన (సెన్సస్)లో కచ్చితత్వం అత్యంత ముఖ్యమని అందుకే దోష రహిత డేటా సేకరణకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. సెన్సస్-2027 కార్యక్రమం గతం కంటే భిన్నంగా పూర్తి డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతోందని కీలక దశ అయిన హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సస్ ను అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లే సమయంలో ప్రజలు సరైన, పూర్తి వివరాల ను తప్పనిసరిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, గృహ నిర్మాణం తదితర రంగాల్లో భవిష్యత్ కార్యాచరణకు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ వివరించారు. ఈ విషయాన్ని గుర్తుంచుకొని క్షేత్రస్థాయిలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నాణ్యమైన డేటా సేకరణకు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట డ్వామా పిడి ఎ.రాము, స్థానిక ఇంచార్జ్ తహశీల్దార్ ఎంపీడివో బి.వి.రామకృష్ణ నాయక్ తదితరులు ఉన్నారు.

# పోషక ఆహారం తీసుకుని ఎముకలు,కీళ్లు సంరక్షించుకోవాలి

- లీ ఫార్మా ,లీ హెల్త్ డొమైన్ అద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం
- ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాద్యత.
- లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి







**విశాఖపట్నం,జూన్ 2 (వార్తాప్రభ) :** ఆరోగ్యాన్ని కాపాడుకొవాల్సిన బాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని,పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఎముకలు,కీళ్ళు సంరక్షించుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఖాజు) ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం. లీ ఫార్మా మరియు లీ హెల్త్ డొమైన్ సంయుక్తంగా, విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (దువ్వాడ) సహకారంతో మంగళవారం ఉద్యోగులందరి కోసం మెగా ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ వైద్య శిబిరం ద్వారా సుమారు 120 మంది ఉద్యోగులకు పైగా లబ్ధి పొందారు. శిబిరంలో పాల్గొన్న వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు, వాటిలో: హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్ (చేతి పట్టు బలం), బి.ఎమ్.ఐ (బాడీ మాస్ ఇండెక్స్), హెచ్.బి (హీమోగ్లోబిన్), ఆర్.బి.ఎస్ (రాండమ్ బ్లడ్ షుగర్), బి.పి (రక్తపోటు),బోన్ మినరల్ డెన్సిటీ (బి.ఎమ్.డి - ఎముకల సాంద్రత పరీక్ష) బాడీ కంపోజిషన్ అనాలిసిస్ (శరీర నిర్మాణ విశ్లేషణ) ఈ పరీక్షల అనంతరం, వైద్యులు మరియు పోషకాహార నిపుణులు (న్యూట్రిషనిస్టులు) నివేదికలను పరిశీలించి, అవసరమైన ఆహారపు అలవాట్లు మరియు జీవనశైలి మార్పులపై వ్యక్తిగత కౌన్సిలింగ్ మరియు సలహాలను అందించారు. కార్యక్రమానికి ముఖ్య పీఠాధిపతులు / ప్రముఖులు పాల్గొని ఆరోగ్య విషయాలు వివరించారు. అనంతరం లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ అల్లా లీలా రాణిఅట్లాడుతూ ప్రధానంగా ఉద్యోగస్తులు నిరంతరం ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు, వైద్య శిబిరంలో సరోజిని మరియు జయలక్ష్మి (క్యాంప్ కోఆర్డినేటర్లు) డాక్టర్ రాధిక , మాధురి మరియు క్రాంతి (పోషకాహార నిపుణులు / న్యూట్రిషనిస్టులు) భాగ్యలత మరియు పవని (జి.ఎన్.ఎమ్ - నర్సులు) కె.వి. ప్రసన్న కుమార్ , ఎ.సి.డి, ప్రధాన కార్యాలయం, విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్, దువ్వాడ. లీ ఫార్మా ఉద్యోగులు, సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి

-వ్యవసాయ అధికారిణి కె.సంధ్యారాణి





**మైలవరం,జూన్ 2 (వార్తాప్రభ) :** రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి కె.సంధ్యారాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మైలవరం పట్టణంలోని రైతు సేవా కేంద్రం నందు కొంతమంది రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు (పిల్లి పెసర, జనము )పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు అన్ని రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచామని తెలియజేశారు. పిల్లిపెసర 150 క్వింటాలు, జనుము 24 క్వింటా లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరో రెండు రోజుల్లో జీలుగ విత్తనాలు అందుబాటు లోకి రానున్నట్లు వ్యవసాయ అధికారిణి తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు కావల్సిన రైతులు ఆయా గ్రామ రైతు సేవా కేంద్రానికి పొలం పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకొని వెళ్ళాలని సూచించారు. పిల్లిపెసర 10 కిలోల బ్యాగ్ పూర్తి ధర రూ.1568 లు కాగా ఇందులో 50 శాతం సబ్సిడీ పోను రైతు రూ. 784 లు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. జనము 10 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.1540 లు కాగా 50 శాతం సబ్సిడీ పోను రైతు రూ. 770 లు చెల్లించాలని ఏవో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**యూరియా, డి ఏ పి ఎరువుల వాడకంపై అవగాహన:** మైలవరం మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలలో యూరియా మరియు డి ఏ పి ఎరువుల వాడకంపై అవగాహనా సదస్సులు నిర్వహించటం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారిణి సంధ్యారాణి తెలిపారు. కావలసిన పరిమాణంలో మాత్రమే ఎరువులు కొనుగోలు చెయ్యాలని తెలిపారు. ఎరువుల యం ఆర్ పి ధరలు, పాత రేటులో కొనుగోలు జరిగినవని, పాతరేటుకు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు బ్యాగుపైన యంఆర్ పి ధరలను సరిచూసుకోవాలని ఏవో పేర్కొన్నారు. రైతులందరు వారి ఫోనులలో ఏపిఎఐఎంఎస్ యాప్ పొందు పరచుకొని వ్యవసాయ సమాచారం తెలుసుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిఎసిఎస్ చైర్మన్ కరెడ్ల వెంకట నారాయణ, విఏఏలు పాల్గొన్నారు.

# రైతులు పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోండి- పిఎసిఎస్ చైర్మన్ రోశాలు

-చంద్రగూడెం పిఎసిఎస్ లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణి



**మైలవరం,జూన్ 2 (వార్తాప్రభ) :** ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చంద్రగూడెం పిఎసిఎస్ చైర్మన్ మోర్ల వెంకట రోశాలు పేర్కొన్నారు. మంగళవారం చంద్రగూడెం గ్రామంలోని రైతు సేవా కేంద్రం నందు భూమి యజమానులు మరియు మల్లె సాగు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశంలో రోశాలు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు చంద్రగూడెం రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్ కి సంబందించి పచ్చిరొట్ట ఎరువులు జనుము,పిల్లి పెసరలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం పలువురు రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకుడు శీలం బ్రహ్మయ్య,టిడిపి నాయకులు శ్రీనివాసరావు, నాగరాజు,గ్రామ రైతులు అగ్రికల్చర్, హార్టికల్చర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రోళ్లపాలెంలో రహదారి వివాదం గ్రామస్తుల రాస్తారోకో

-రహదారి అడ్డుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**అమలాపురం,జూన్ 2 (వార్తాప్రభ) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలంలోని రోళ్లపాలెం గ్రామంలో మంగళ వారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి ప్రధాన రాకపోకల మార్గంగా నాలుగు దశాబ్దాలుగా వినియోగంలో ఉన్న చిట్టిగరువు రహదారిపై కొందరు వ్యక్తులు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, రైతులు, యువకులు రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం, గత 40 ఏళ్లుగా ప్రజలు ఈ మార్గాన్నే వినియోగిస్తూ గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఈ రహదారిపై వివాదం సృష్టిస్తూ కొందరు వ్యక్తులు ప్రజల సంచార స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. రహదారి మధ్యలో కర్రలు, రాళ్లు, దిమ్మలు, ఇతర అడ్డంకులు ఏర్పాటు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శవల రాజశేఖర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు దశాబ్దాలుగా వినియోగిస్తున్న రహదారిని వ్యక్తిగత ఆస్తిగా పేర్కొంటూ కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ దారిలో వెళ్లే వారిని బెదిరించడం, వాహనాలను అడ్డుకోవడం, ప్రశ్నించిన వారిపై కేసులు పెడతామని హెచ్చరించడం వంటి చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. దీనివల్ల గ్రామ ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా, అత్యవసర పరిస్థితుల్లోనూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం, రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడం, రోగులను ఆసుపత్రులకు తరలించడం వంటి అవసరాలన్నింటికీ ఈ రహదారే ప్రధాన మార్గమని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్లు సకాలంలో చేరుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్తులు ఆరోపించారు. పలుమార్లు రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య అలాగే కొనసాగుతోందని చెప్పారు. ఇటీవల రహదారిని పూర్తిగా మూసివేసే ప్రయత్నం చేయడంతో గ్రామ ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా చందాలు సేకరించి రహదారి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ప్రజల సొంత నిధులతో రహదారిని అభివృద్ధి చేసుకునేందుకు సిద్ధమయ్యామని, దీనికి ఎటువంటి అడ్డంకులు కల్పించకుండా ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. గ్రామస్తులు మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా ప్రజల వినియోగంలో ఉన్న రహదారిపై వివాదాలకు తెరదించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. రోళ్లపాలెం గ్రామంలో చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజా అవసరాలకు ఉపయోగపడుతున్న రహదారుల విషయంలో అధికారులు త్వరితగతిన స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# సామాజిక తెలంగాణ సాధనకు ఉద్యమిద్దాం.. బేరి రామచంద్ర యాదవ్ పిలుపు





**హైదరాబాద్,జూన్ 2 (వార్తాప్రభ) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆద్యులు జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలవేసి కొబ్బరికాయలు కొట్టి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామ చంద్ర యాదవ్ బృందం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం బేరి రామ చంద్ర యాదవ్ మిత్ర బృందం జయశంకర్ ప్రాంగణం రైల్వే స్టేషన్ లింగంపల్లి దగ్గరలో జెండా ఆవిష్కరణ చేసి జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి జయశంకర్ ఆశయాలను సాధిస్తామని, జై తెలంగాణ, జై తెలంగాణ నినాదాలతో పాల్గొని ఉత్సవం జరుపుకున్నారు. తదనంతరం శేరిలింగంపల్లిలో సీనియర్ సిటిజన్స్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పురస్కరించుకుని జెండా ఎగురవేసి సమావేశం ఏర్పాటు చేసుకొని సాంస్కృతిక, మిగతా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న వారిలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్, యువజన సంఘం అధ్యక్షులు అందేల కుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరికృష్ణ చారి మల్లికార్జున్ శర్మ, గోవింద్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, బాల్రాజ్, గోవింద్, బ్యాండ్ రమేష్, మేదరి మహేంద్ర సంఘం కిరణ్, నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల రవీందర్, కోశాధికారి బీరకోట శేఖర్, మంగలి పరశురాం, మంగలి నరేష్, ముదిరాజ్ సంఘం శేర్లింగంపల్లి మనోజ్ ముదిరాజ్ , కృష్ణ గౌడ్,పెద్దలు యువజన నాయకులు అందరు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# వేలంకలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి వాము దగ్ధం



**కిర్లంపూడి,జూన్ 2 (వార్తాప్రభ) :** కిర్లంపూడి మండలం వేలంక గ్రామానికి చెందిన దోమాల కృష్ణజడ్జికి చెందిన గడ్డి వాము విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంగళవారం అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజిన్ ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చింది. అయితే అప్పటికే గడ్డి వాము పూర్తిగా కాలిపోయి భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. స్థానికులు కూడా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో రైతుకు గణనీయమైన ఆర్థిక నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆడారి సురేంద్రకు చదలవాడ బాబి పరామర్శ..



**కిర్లంపూడి,జూన్ 2 (వార్తాప్రభ) :** సీనియర్ జర్నలిస్ట్, ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యుడు ఆడారి సురేంద్రకు కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ చదలవాడ బాబి మంగళవారం పరామర్శించారు. ఆడారి సురేంద్ర ఇటీవల కాలంలో వెన్నుముక సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న చదలవాడ బాబి సురేంద్ర ఇంటికి చేరుకుని పరామర్శించడమే కాకుండా,ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కిర్లంపూడి సొసైటీ మాజీ డైరెక్టర్ గండే గోపి, ఎల్లపు శివ, చిక్కాల కల్కి భగవాన్,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉడతా అప్పారావు తదితరులు సురేంద్రను పరామర్శించిన వారిలో ఉన్నారు.

# సౌత్ కోస్ట్ రైల్వే జోన్ తొలి సీడబ్ల్యూఎంగా ఆనంద్

- ఘనంగా సత్కరించిన ఎంప్లాయీస్ సంఘ్ నేతలు



**ఇబ్రహీంపట్నం,జూన్ 2 (వార్తాప్రభ) :** గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు నూతన చీఫ్ వర్క్ షాపు మేనేజర్ (సీడబ్ల్యూఎం)గా బాధ్యతలు స్వీకరించిన బి.ఆనంద్ ను సౌత్ కోస్ట్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ తొలి సీడబ్ల్యూఎంగా బాధ్యతలు చేపట్టిన ఆనంద్ కు సంఘ్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి వారి నాయకత్వంలో వర్క్ షాపు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూఎం సంఘ్ ప్రతినిధులతో అప్యాయంగా ముచ్చటించి ఉద్యోగుల సంక్షేమం, వర్క్ షాపు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ్ కార్యదర్శి గద్దా సురేష్, చైర్మన్ సుధాకర్, వర్కింగ్ చైర్మన్ డేవిడ్ రాజు, ట్రెజరర్ సాయి, ఆఫీస్ బేరర్లు శివ, బోయజ్, మద్దయ్య, శంకర్, సుబ్రహ్మణ్యం, కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్



**కృత్తివెన్ను,జూన్ 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా మంగళవారం భీమవరం గ్రీన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ లో ( వీరమ్మ పాండ్) వద్ద వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ వాకర్ వడుపు గోపి, క్యాబినెట్ సెక్రటరీ కొప్పినీడి సూర్యప్రకాష్ ఆర్ధ్వర్యం లో డ్రైనేజీలు, పార్క్ ఏరియా పరిశుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ వాకర్ వడుపు గోపి ,కేబినెట్ సెక్రటరీ వాకర్ కొప్పినీడి సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజలంతా ఎల్లప్పుడూ డస్ట్ బిన్స్ లో నే చెత్తను వేయాలని రోడ్లపైన గాని పార్కుల్లో గాని ,పబ్లిక్ ప్లేస్ లో గాని చెత్తను గాని ప్లాస్టిక్ వస్తువులను పారవేయ రాదని కోరారు. కొద్ది రోజులుగా భీమవరం మున్సిపాలిటీ అధికారులు, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు మరియు పారిశుద్ధ్య కార్మికులు ,శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో పట్టణంలో ఎక్కడా కూడా చెత్తను వేయకూడదు క్లీన్ భీమవరం గ్రీన్ భీమవరం గా పట్టణాన్ని తయారు చేయాలని చేస్తున్న ఈ కార్యక్రమంలో ఆల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని జయప్రదం చేస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు భీమాల శ్రీరామ్ మూర్తి వాకర్స్ కోఆర్డినేటర్ బోండా శ్రీరామ్ , ట్రెజరర్ హనుమంతరావు నల్లం రఘుబాబు కురిసేటి గోపాలకృష్ణ గ్రీన్ పార్క్ వాకర్ అసోసియేషన్ పిఎస్టీలు హాజరైనారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188